బుధవారం
WEDNESDAY
11-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 132

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





బరువు తగ్గే మందులతో అంధత్వం!

బరువు తగ్గడానికి, మధుమేహ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా విరివిగా వాడుతున్న ప్రముఖ ఔషధాలపై అమెరికా ఆరోగ్య నియంత్రణ సంస్థ అయిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్‌డీఏ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

వాషింగ్టన్: ఓజెంపిక్, వెగోవీ వంటి మందుల వాడకం వల్ల అత్యంత అరుదైన కంటి సమస్య తలెత్తి, తీవ్రమైన లేదా శాశ్వత దృష్టి లోపం ఏర్పడే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, గ్లూకగాన్-లైక్ పెప్టైడ్-1 (జీఎల్‌పీ-1) రిసెప్టర్ అగోనిస్ట్ తరగతికి చెందిన అన్ని ఔషధాల లేబుళ్లపై ఈ మేరకు ప్రత్యేక భద్రతా హెచ్చరికను తప్పని సరిగా చేర్చాలని తయారీ సంస్థలను ఆదేశించింది. ఊబకాయం, టైప్ 2 డయాబెటిస్ చికిత్సలో విని యోగించే ప్రముఖ ఔషధాలు ఈ కేటగిరీ పరిధి లోకి వస్తాయి. వీటిలో ప్రపంచ మార్కెట్లో అత్యధిక అమ్మకాలు సాధిస్తున్న నోవో నార్డిస్క్ సంస్థకు చెందిన 'ఓజెంపిక్', 'వెగోవీ'లతో పాటు ఎలీ లిల్లీ సంస్థ తయారు చేసే 'మౌంజారో', 'జెప్‌బౌండ్' వంటి పాపులర్ తరువాయి 2 వ పేజీలో...



ఎనర్జీ డ్రింక్స్‌తో గుండెకు ముగులు

గుండె కొట్టుకునే వేగం పెరిగే ప్రమాదం

అలసటగా అనిపించినప్పుడు.. నిద్రమత్తు ఆవహించినప్పుడు.. వెంటనే ఉత్సాహం రావాలంటే చాలామంది ఎనర్జీ డ్రింక్స్ వైపు చూస్తుంటారు. ముఖ్యంగా యువతలో వీటి వినియోగం పెరుగుతోంది.

వాషింగ్టన్: వ్యాయామం చేసే ముందు, రాత్రిళ్లు మేల్కొని పనిచేసేటప్పుడు వీటిని తాగడం అలవాటుగా మారింది. అయితే తక్షణ ఉత్సాహాన్నిచ్చే ఈ పానీయాలు గుండె ఆరోగ్యానికి ముప్పుగా మారవచ్చని తాజా పరిశోధన హెచ్చరిస్తోంది. వీటిలో ఉండే కెఫీన్ సహా ఇతర స్టిములెంట్స్ గుండె కొట్టుకునే వేగాన్ని పెంచడంతో పాటు తీవ్రమైన గుండె సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని పరిశో ధకులు చెబుతున్నారు. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) భద్రతా డేటాబేస్‌లో 2017 నుంచి 2025 వరకు నమోదైన 28,345 నివేదికలను పరిశోధకులు తరువాయి 2 వ పేజీలో...

విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్లు బ్యాన్

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను తమ రాజకీయ, కుటుంబ అవసరాల కోసం వినియోగించుకుంటున్నాయి. ఈ క్రమంలో అనేక అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడమే కాకుండా కొన్ని సార్లు విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యా సంస్థల్లో సినిమా, ఇతర ప్రైవేటు కార్యక్రమాల ప్రమోషన్లపై నిషేధం విధించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవలి కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న పరిణామాలు ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, విద్యావంతుల్లో ఆందోళన నెలకొంది.

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): విద్యా సంస్థల యాజమాన్యా లు ఇష్టారీతిగా సెలవులు ప్రకటించడం, ఎటువంటి జాగ్రత్తలు తీసుకో కుండానే భారీ కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోవ డం తల్లిదండ్రులను తీవ్రంగా కలవరపరుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యం లో విద్యా సంస్థలు చట్టపరంగా వారి క్యాంపస్‌లలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవచ్చు, ఎటువంటివి నిర్వహించకూడదనే అంశంపై సమగ్రంగా అధ్య యనం చేయాలని ప్రభుత్వ పెద్దలు విద్యా తరువాయి 2 వ పేజీలో...



నీళ్లే మా ఓటు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణా జలాలే కీలకం

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్, సుప్రీంలో గట్టిగా వాదనలు వినిపించాలి

కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా సాధించాలి

నీటిపారుదల శాఖ, న్యాయ నిపుణులతో సమీక్షలో రేవంత్‌రెడ్డి

కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట సమర్థంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏపీతో జల వివాదాలున్న అన్ని అంశాలపై అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. వచ్చే శాసనసభ సాధారణ ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి కృష్ణా జలాల పంపిణీ అంశం ఎంతో కీలకం కానుందని, సాధ్యమైనంత మేరకు గరిష్టంగా కృష్ణా జలాలను సాధించడానికి గట్టిగా ప్రయత్నించాలని ఆదేశించారు.

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి సీఎం ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో ట్రిబ్యునల్‌లో జరగనున్న విచారణలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన వాదనలపై న్యాయ నిపుణులతో చర్చించారు. 75 శాతం, 65 శాతం నీటి లభ్యత ఆధారంగా బచావత్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునళ్లు ఉమ్మడి ఏపీకి కేటాయించిన మొత్తం 1,050 టీఎంసీల కృష్ణా జలాలను అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం-1956లోని సెక్షన్- 3 కింద ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేసే బాధ్యతను గత శాసనసభ సాధారణ ఎన్నికలకు ముందు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. సెక్షన్-3 కింద ట్రిబ్యునల్‌లో ఇప్పటికే తెలంగాణ, ఏపీ రాష్ట్రాల వాదనలు ముగిశాయని, ఏపీ వాదనలను ఖండిస్తూ తరువాయి 2 వ పేజీలో...

ఇగం పెడుతోంది..!

తెలంగాణలో చలి షురూ



తెలంగాణలో చలికాలం ప్రభావం క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా అర్ధరాత్రి, తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. కాగా, వాయవ్య దిశ నుంచి వీస్తున్న చల్లని గాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు మరో 1 నుంచి 2 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం (టీఎస్‌డీపీఎస్) వాతావరణ గణాంకాల ప్రకారం.. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. వెస్ట్ మారేడ్‌పల్లిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 15.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. షామీర్‌పేట మండలంలోని దేవరయంజల్‌లో 15.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రంగారెడ్డి జిల్లాలోని అరుట్లలో 14.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ చలి ప్రభావం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా కుబీర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 14.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ రాత్రి ఉ ష్ణోగ్రతలు 14 నుంచి 15 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో చల్లని గాలుల ప్రభావం తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,460
వెండి (కిలో):	రూ.2,05,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,724

తాత ఆస్తిపై మనుమడికి హక్కు లేదు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు



న్యూఢిల్లీ: తాతల కాలం నాటి ఆస్తి అంటే మనుమళ్లకు కూడా అందులో పుట్టుకతోనే సమానమైన భాగస్వామ్యం ఉంటుందని, తండ్రిని కాదని కూడా ఆస్తిని డిమాండ్ చేయవ చ్చని సమాజంలో చాలా మంది భావిస్తుంటారు. అయితే.. మనుషుల సంప్రదాయ భావనల కంటే చట్ట నిబంధనలే ప్రామాణికమని స్పష్టం చేస్తూ, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తాజాగా చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. చెన్నైకి చెందిన ఒక వ్యక్తి తన తాత ఆస్తిలో తనకు కూడా సగం వాటా కావాలని 1997లో కోర్టులో కేసు వేశాడు. తాత ఆస్తిని పంచుకోవడం ద్వారా తన తండ్రికి వచ్చిన భూమిని, ఆయన ఇతరులకు విక్రయించడాన్ని ఆ కొడుకు సవాలు చేశాడు. అయితే.. ఈ కేసును పరిశీలించిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఆ అప్పీల్‌ను కొట్టివేసింది. తండ్రికి వారసత్వంగా దక్కిన ఆస్తిని ఆయన తన ఇష్టప్రకారం అమ్ముకునే పూర్తి స్వేచ్ఛ ఉందని, దాన్ని కొడుకులు లేదా మనుమళ్లు ఆపలేరని తేల్చిచెప్పింది. తాత మరణించిన తర్వాత ఆయన ఆస్తి 1956 హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 8 ప్రకారం ఆయన ప్రాథమిక వారసులైన (క్లాస్-1) కొడు కులు, కూతుళ్లకు చెందుతుంది. ఆ చట్టబద్ధమైన పద్ధతిలో ఆస్తిని పంచుకున్నప్పుడు, తరువాయి 2 వ పేజీలో...

డిజి అరెస్టు మోసాలపై స్పందనేది?

తీసుకున్న, తీసుకోబోయే చర్యలేంటి?

వాట్సాప్, టెక్ సంస్థలకు సుప్రీం ఆదేశాలు

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ తరహా అత్యాధునిక సైబర్ నేరాలను అరికట్టేందుకు తక్షణమే పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని ప్రముఖ మెసేజింగ్ వేదిక వాట్సాప్‌తో పాటు ఇతర టెక్ మీడియేషన్ సంస్థలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మోసాల నివారణకు తాము తీసుకుంటున్న, భవిష్యత్తులో తీసుకోబోయే ముందస్తు రక్షణ చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: నకిలీ పత్రాలు, నకిలీ నోటీసుల ఆధారంగా జరుగుతున్న డిజిటల్ అరెస్టుల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్‌ల ధర్మాసనం స్పందిస్తూ.. వినియోగదారులను మో సాల బారిన పడకుండా కాపాడేందుకు రూపొం దించే ప్రణాళికలను ఒకవైపు కోర్టుకు, మరోవైపు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C)కు ఏకకాలంలో సమర్పించాలని టెక్ సంస్థలను ఆదేశించింది. -2 వ పేజీలో...

విశ్వవాణి



వయసు పెరిగే కొద్దీ జుట్టు నెరవడం సహజం. అయితే ఈ ప్రక్రియకు క్యాన్సర్ నివారణతోనూ సంబంధం ఉండవచ్చని శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. జుట్టుకు సహజమైన రంగును అందించే మెలనిన్ అనే వర్ణద్రవ్యాన్ని మెలనోసైట్స్ అనే ప్రత్యేక కణాలు ఉత్పత్తి చేస్తాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ కణాల్లో కొన్ని మెలనిన్ ఉత్పత్తిని నిలిపివేస్తాయి. దీంతో వెంట్రుకలు క్రమంగా తెలుపు లేదా బూడిద రంగులోకి మారతాయి. ఈ మార్పు కేవలం జుట్టు రంగుకే పరిమితం కాకుండా, దెబ్బతిన్న కణాల పనితీరుపైనా ప్రభావం చూపవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. దెబ్బతిన్న కణాలు నిరంతరం విభజన చెందుతూ పెరిగే బదులు, కొన్ని సందర్భాల్లో రక్షణాత్మక మార్పులకు లోనవుతాయని వారి పరిశీలన. ఈ విధానం ప్రమాదకర కణాలు క్యాన్సర్‌గా మారకుండా అడ్డుకునే అవకాశాన్ని కల్పించవచ్చని అంచనా వేస్తున్నారు.

టార్గెట్.. డ్రగ్స్ ఫ్రీ

నక్సల్ రహిత భారత్ తర్వాత ఇదే మన లక్ష్యం: అమిత్ షా

దేశవ్యాప్తంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందిన వారం కావడంతో రాష్ట్రం ఏడాది ముందే ఈ లక్ష్యాన్ని అందుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు.



న్యూఢిల్లీ: వీటిలో ఇస్కాన్-సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టు లు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు. రాష్ట్రంలో మాదకద్ర వ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి '1033' టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని తరువాయి 2 వ పేజీలో...

పవన్ విడాకులపై డోంట్ టాక్!

వ్యక్తిగత వ్యవహారంపై మాట్లాడొద్దు

కార్యకర్తలకు టీడీపీ, వైసీపీ ఆదేశాలు



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే. తాము పరస్పర అంగీకారంతో, గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. తమ పిల్లల పట్ల బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కొనసాగుతామని, స్నేహితులుగా ఉ ంటామని స్పష్టం చేశారు. ఈ సున్నితమైన సమయంలో తమ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని వారు కోరారు.

విజయవాడ, నవంబర్ 10 (ఈవార్తలు): పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధిం చిన ఈ పరిణామంపై అధికార కూటమిలో భాగమైన తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఐటీడీపీ స్పందించింది. ఎవరి వ్యక్తి గత జీవితంపైనా స్పందించవద్దని పేర్కొం ది. కూటమి పార్టీల నేతలతో పాటు వైసీపీ నేతల వ్యక్తిగత జీవితాలపై కూడా ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని స్పష్టం చేసింది. ఐటీడీపీకితరువాయి 2 వ పేజీలో...



సర్కారును వదలం

కదం తొక్కిన ఓయూ నాన్-టీచింగ్ స్టాఫ్

వర్సిటీలో మహా ధర్నా నిర్వహణ 2

అఖిలపక్ష నేతల సంపూర్ణ మద్దతు

రాశి ఫలాలు

11.11.2026

మేషం: బంధు మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. మాతృ వర్గ బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావు. వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి.

వృషభం: గృహమున సంతోషకర వాతావరణం ఉంటుంది. సమాజంలో ప్రముఖుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థికంగా కొంత మేలైన సౌకర్యాలుంటాయి. చిన్ననాటి మిత్రులతో ఉన్న మనస్పర్ధలు తొలగుతాయి.

మిథునం: సంతాన విద్యా విషయాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో నిరుత్సాహం తప్పదు. వ్యాపార ఉద్యోగాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. సన్నిహితులతో ఒక వ్యవహారంలో మనస్పర్ధలు కలుగుతాయి.

కర్కాటకం: బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమవుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఇంటాబయట సమస్యలు తెలివిగా పరిష్కరించుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

సింహం: నూతన ఋణ ప్రయత్నాలు ఫలించవు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. సకాలంలో పనులు పూర్తికాక చికాకులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు ఉంటాయి. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య: అన్ని రంగాల వారికి అనుకూల పరిస్థితులుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వ్యాపారములలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

తుల: వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. చేపట్టిన పనులలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. దూరప్రాంత బంధువుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.

వృశ్చికం: ముఖ్యమైన పనులలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఇంటా బయట ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొనడం మంచిది. నూతన ఋణయత్నాలు నిదానంగా సాగుతాయి.

ధనస్సు: మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహపరుస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యయ ప్రయాసలు అధికమౌతాయి.

మకరం: సంఘంలో విశేషమైన గౌరవమర్యాదలు పొందుతారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు మరింత సానుకూలంగా సాగుతాయి.

కుంభం: ధన వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేయుట మంచిది. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. దూర ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి.

మీనం: నిరుద్యోగుల కష్టం ఫలించదు. నూతన కార్యక్రమాలు ప్రారంభించకపోవడం మంచిది. సంతాన అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యుల మాటలు కొంత నిరాశ కలిగిస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి.

సర్కారును వదలం

కదం తొక్కిన ఓయూ నాన్-టీచింగ్ స్టాఫ్

వర్సిటీలో మహా ధర్నా నిర్వహణ

అఖిలపక్ష నేతల సంపూర్ణ మద్దతు

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): ఉస్మానియా యూనివర్సిటీ నాన్-టీచింగ్ స్టాఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'మహా ధర్నా' వేలాది గొంతుకల నినాదాలతో హోరెత్తింది. వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట జరిగిన ఈ నిరసనలో వందలాది మంది బోధనేతర ఉద్యోగులు ఎండను, భోజన విరామాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు నాలుగు గంటల పాటు కదలకుండా కూర్చుని తమ ఐక్యతను చాటుకున్నారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, మేధావులు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు తరలివచ్చి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. మహా ధర్నాలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ధరల పెరుగుదల నేపథ్యంలో కేవలం రూ.15 వేల తక్కువ వేతనంతో ఉద్యోగులు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కనీస భరోసా లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో విద్యుత్ శాఖలో ఆర్టిజన్లను, ఇతర ప్రభుత్వ విభాగాల్లోని సిబ్బందిని రెగ్యులరైజ్ చేసినప్పటికీ, వర్సిటీ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. చట్టాలతో పాటు అధికారులకు తోటి మనిషి బాధను అర్థం చేసుకునే మానవత్వం ఉండాలని హితవు పలికారు. సమస్యలపై పూర్తి వివరాలతో సమగ్ర డాక్యుమెంట్ అందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవరకు వదిలిపెట్టబోనని హామీ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా ఓయూలో ఉద్యోగుల రక్తం, చెమటను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 105 ఏళ్ల ఓయూ చరిత్రలో మాదిగ బిడ్డను వీసీని చేశామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం, వర్సిటీకి ఇస్తామన్న రూ.1,000 కోట్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వీసీ ఉద్యోగులను పట్టించుకోకుండా ప్రభుత్వానికి గులాంగిరీ చేస్తున్నారని, ఛాన్సలర్ హోదాలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 85 శాతం లోకల్ కోటాను పక్కనపెట్టి ఓయూ సెక్యూరిటీలో యూపీ, బీహార్ వాళ్లనే ఎందుకు నియమిస్తున్నారని కవిత నిలదీశారు. అకారణంగా సస్పెండ్ చేసిన ప్రొఫెసర్ మనోహర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, టైమ్ స్కేల్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఈపీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. నాన్-పర్మినెంట్ సిబ్బంది కోసం పర్మినెంట్ ఉద్యోగులు, ఆడబిడ్డలు ముందుండి పోరాడటం గొప్ప విషయమంటూ వారికి సెల్యూట్ చేశారు. అనారోగ్య కారణాల వల్ల ప్రత్యక్షంగా రాలేకపోయిన ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఫోన్ ద్వారా ఉద్యోగులకు సంఘీభావ సందేశం వినిపించారు. 20 ఏళ్లుగా ఈ సమస్యలు పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు. ఒక భవన నిర్మాణం వంటి తాత్కాలిక పనులకే కాంట్రాక్ట్ కార్మికులను పెడతారని, కానీ శాశ్వతంగా ఉండే ఉస్మానియా వర్సిటీలో పదవీ విరమణ చేసేవరకు కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేయించడం శ్రమ దోపిడీకి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే వీరిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు కోరుతున్నవి గొంతెమ్మ కోరికలు కావని, సాధారణ సమస్యలను జటిలం చేసి వారిని రోడ్లపైకి తేవడం బాధాకరమని, అవసరమైతే సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆర్ కృష్ణయ్య హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు ఎక్కువ సమయం పట్టదని, వర్సిటీల అభివృద్ధికి కేటాయించిన రూ.1,000 కోట్లలో కనీసం రూ.100 కోట్లు కేటాయించినా ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. జాన్ వెస్లీ (సీపీఎం రాష్ట్ర కార్యదర్శి): ఓపీఎస్, సీపీఎస్ పెన్షన్ విధానాల్లో ఉద్యోగులకు న్యాయం చేయాలని, టైమ్ స్కేల్ రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఈపీఎఫ్/ఈపీఎస్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ వరంగల్ రవి (టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్): ఉద్యోగుల సమస్యలను వీసీ వెంటనే పరిష్కరించాలని, వర్సిటీ స్థాయిలో కాకపోతే తానే స్వయంగా జేఏసీ నేతలను సీఎం, డిప్యూటీ సీఎంల వద్దకు తీసుకెళ్లి సమావేశం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఏళ్లుగా వర్సిటీకి సేవలందిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డాక్టర్ పృథ్వీరాజ్ (తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు) కోరారు. మహా ధర్నాను విజయవంతం చేసిన ప్రతి ఉద్యోగికి, మద్దతు తెలిపిన రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలకు ఓయూ నాన్-టీచింగ్ స్టాఫ్ జేఏసీ చైర్మన్ డాక్టర్ కుమార్, అధ్యక్షులు ఖదీర్ ఖాన్ ఇతర జేఏసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల ఐక్యతే తమ బలమని, న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమిష్టి పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.

నీళ్లే మా ఓటు



మొదటి పేజీ తరువాయి

తెలంగాణ వినిపిస్తున్న ప్రతివాదనలు చివరి దశకు చేరుకున్నాయని అధికారులు, న్యాయనిపుణులు సీఎంకు వివరించారు. డిసెంబర్‌లోగా ప్రతివాదనలు ముగిసే అవకాశం ఉందని చెప్పారు. ఆ తర్వాత సెక్షన్-3 కింద బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తన తీర్పును రిజర్వ్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. సెక్షన్-3 కింద కృష్ణా జలాల పంపిణీకి కేంద్రం జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసు సత్వరంగా కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకోవాలని న్యాయనిపుణులను సీఎం ఆదేశించారు. సెక్షన్-3 కింద నీటి పంపకాలకు కేంద్రం ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు ఆమోదిస్తే, ఏపీ పునర్విభజన చట్టం-2014లోని సెక్షన్ 89 కింద రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల కోసం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మళ్లీ విచారణ జరపాల్సిన అవసరం ఉండదని అధికారులు తెలియజేశారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 1,050 టీఎంసీల వాటాలో తెలంగాణకు 673 టీఎంసీలను (64%) కేటాయించాలని ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపిస్తున్నామని తెలియజేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ పాల్గొన్నారు. డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన ప్రకారం ఏదుల నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఈ రెండు పథకాలకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లపూర్ నుంచి ఏదుల వరకు తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులను సీఎం హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి ఉన్నందున అదనపు టీఎంసీ పనుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించి, భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. సీడబ్ల్యూసీ నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతో పాటు డీపీఆర్ సిద్ధం చేసి మరోసారి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు.

పవన్ విడాకులపై డోంట్ టాక్!

మొదటి పేజీ తరువాయి



అనుబంధంగా ఉన్న ఏ సోషల్ మీడియా ఖాతా నుంచైనా ఇలాంటి వ్యాఖ్యలు వస్తే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇతరులను కించపరిచేలా చేసే వ్యక్తిగత అభిప్రాయాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. అటు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కూడా హుందాగా స్పందించింది. రాజకీయ నాయకుల వ్యక్తిగత జీవితాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందనేది ఆ ప్రకటన సారాంశం. "ఒక రాజకీయ నాయకుడి వ్యక్తిగత విషయానికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జరుగుతున్నట్లు గమనించాము. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. కాబట్టి సంబంధిత వ్యక్తుల గోప్యతను గౌరవించాలి. బహిరంగ వేదికలపై మాట్లాడేటప్పుడు విచక్షణ పాటించాలి. ఈ విషయంలో పార్టీ నేతలు, ప్రతినిధులు, కేడర్, సోషల్ మీడియా కార్యకర్తలు కొన్ని సూచనలు పాటించాలి" అని ఆ ప్రకటనలో పేర్కొంది. సాధారణంగా రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు, ట్రోలింగ్స్ జరిగే ప్రస్తుత రాజకీయాల్లో పవన్ విషయంలో వైసీపీ, టీడీపీ తీసుకున్న ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో ఒక కొత్త, ఆరోగ్యకరమైన సంప్రదాయానికి తెరలేపినట్లుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత దాడులకు దూరంగా ఉంటూ, విధానపరమైన అంశాలపైనే దృష్టి సారించాలనే సందేశాన్ని ఈ పార్టీలు తమ కేడర్‌కు బలంగా పంపినట్లయింది.

ఎనర్జీ డ్రింక్స్‌తో గుండెకు బుగులు

మొదటి పేజీ తరువాయి

విశ్లేషించారు. వీటిలో కెఫీన్ లేదా ఇతర స్టిములెంట్స్ ఉన్న ఎనర్జీ డ్రింక్స్, సప్లిమెంట్లకు సంబంధించినవి 854 నివేదికలు ఉన్నాయి. స్టిములెంట్స్ లేని ఇతర ఉత్పత్తులతో పోలిస్తే వీటికి సంబంధించిన నివేదికల్లో గుండె ఆగిపోవడం గురించి ప్రస్తావన 11 రెట్లు, గుండెపోటు ప్రస్తావన 4.5 రెట్లు ఎక్కువగా ఉంది. గుండె లయలో అసాధారణ మార్పులు, గుండె దడ, గుండె వేగం పెరగడం, ఛాతీ నొప్పి, స్పృహ కోల్పోవడం వంటి సమస్యల ప్రస్తావన కూడా ఎక్కువగా కనిపించింది. ఈ నివేదికల్లో 18 నుంచి 34 ఏళ్ల వయసున్నవారికి సంబంధించినవి సుమారు 45 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అలసట తగ్గించుకోవడానికి, వ్యాయామంలో శక్తి పెంచుకోవడానికి యువత ఎనర్జీ డ్రింక్స్, ప్రీ-వర్కౌట్ సప్లిమెంట్లను ఎక్కువగా తీసుకుంటుండటం ఇందుకు ఒక కారణం కావచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. కొందరు వ్యాయామానికి ముందు వీటిని తీసుకోవడంతో పాటు ఆల్కహాల్ లేదా ఇతర డ్రింక్స్‌తో కలిపి తాగుతున్నారు.

డిజి అరెస్టు మోసాలపై స్పందనేది?



మొదటి పేజీ తరువాయి

ఈ విచారణ సందర్భంగా వాట్సాప్ తరఫు న్యాయవాది తమ వాదనలను వినిపించారు. మోసపూరిత వ్యవహారాలను అడ్డుకునేందుకు ఇప్పటికే వేలాది అనుమానాస్పద ఖాతాలపై వేటు వేశామని కోర్టుకు తెలిపారు. నేరగాళ్ల ఖాతాలను గుర్తించడంతో పాటు, వినియోగదారులను ముందస్తుగా హెచ్చరించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఫీచర్లను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. మరోవైపు, టెక్ సంస్థలతో పాటు ఆర్థిక లావాదేవీలు నిర్వహించే బ్యాంకుల జవాబుదారీతనంపైనా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిబంధనల ప్రకారం ఖాతాదారుల వివరాలు, లావాదేవీల విషయంలో తగిన ముందస్తు జాగ్రత్తలు (డ్యూ డిలిజెన్స్) పాటించడంలో బ్యాంకులు విఫలమైతే, వాటిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. బ్యాంకుల నిర్లక్ష్యం కారణంగా ఖాతాదారులు డిజిటల్ మోసాల బారిన పడి సొమ్ము కోల్పోతే, ఆ మొత్తాన్ని బ్యాంకులే పరిహారంగా చెల్లించాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ తరహా నేరాలను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న దర్యాప్తు సంస్థల సమన్వయం అవసరమని కోర్టు పేర్కొంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో డిజిటల్ అరెస్ట్ మోసాలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతి, భవిష్యత్ నివారణ వ్యూహాలతో కూడిన పూర్తి స్థాయి నివేదికలను సమర్పించాలని డీజీపీలను ఆదేశించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

తాత ఆస్తిపై మనుమడికి హక్కు లేదు

మొదటి పేజీ తరువాయి

తండ్రి వాటాకు వచ్చిన భూమి లేదా ఇల్లు పూర్తిగా ఆయన వ్యక్తిగత, స్వార్జిత ఆస్తిగా మారుతుంది. ఆ తర్వాత ఆ ఆస్తిపై కొడుకులకు గానీ, మనుమళ్లకు గానీ పుట్టుకతో ఎలాంటి హక్కులు ఉండవు. తండ్రి బ్రతికి ఉన్నంత కాలం తన వాటాగా వచ్చిన ఆస్తిపై ఆయనకే సర్వాధికారాలు ఉంటాయని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఒకసారి ఆస్తి పంపకాలు పూర్తయితే, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ముగిసిపోయి ఎవరి వాటా వారి సొంతమవుతుందని కోర్టు స్పష్టం చేసింది.

టార్గెట్.. డ్రగ్స్ ఫ్రీ

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధితులకు చికిత్స అందించేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వివరాలు కూడా బయటకు రానివ్వమని ఆయన స్పష్టం చేశారు.

విద్యాసంస్థల్లో సినిమా ప్రమోషన్లు బ్యాన్

మొదటి పేజీ తరువాయి

శాఖాధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ యోచన ప్రకారం... ప్రాథమికంగా, విద్యా సంస్థల ప్రాంగణాలను విద్యా, క్రీడా కార్యక్రమాలకు మినహా సినిమా, ఇతర వాణిజ్య కార్యక్రమాలకు వినియోగించకూడదు. విద్యా, క్రీడా కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహిస్తే, ఎంత మంది హాజరవుతారు, స్టేజీ నిర్మాణం, రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ తదితర వివరాలను ముందుగానే స్థానిక విద్యా శాఖ అధికారులు/ పోలీసులకు అందజేయాలి. క్రీడా, సాంస్కృతిక, కళా రంగానికి సంబంధించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే, ప్రోత్సహించే చిన్న కార్యక్రమాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదు. వందలాది మందితో నిర్వహించే వాటి విషయంలో మాత్రం విద్యా సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి. ఉద్యోగాల కల్పన, స్టార్టప్స్, ఆవిష్కరణల్లో తెలంగాణ విద్యార్థులు గొప్ప ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, గూగుల్ ఫర్ స్టార్టప్స్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్ వంటివి చేపట్టింది. కళలు, సంస్కృతి, సృజనాత్మకతకు సంబంధించి గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానం, యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ వంటి కార్యక్రమాలు నిర్వహించింది. అదే సమయంలో కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు అందుకు భిన్నంగా తాము సూచించిన సినిమాలు చూడాలని, ఆ సినిమా చూసేందుకు సెలవులు సైతం ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఇటీవల ఒక విద్యా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో స్టేజీ కూలి విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో విద్యా సంస్థలకు మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది.

ఇగం పెడుతోంది..!



మొదటి పేజీ తరువాయి

మరింత పెరిగే అవకాశం ఉండటంతో రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణంగానే ఉంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. పగటిపూట ఎండ తీవ్రత పెద్దగా తగ్గకపోయినా.. సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడుతోంది. రాత్రి, తెల్లవారుజామున ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలికాలం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. రానున్న వారం పొడి వాతావరణం కొనసాగడంతో పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 1-2 డిగ్రీలు తగ్గే అవకాశం ఉంది. దీంతో ప్రజలు ముఖ్యంగా రాత్రి, తెల్లవారుజామున చలి పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

బరువు తగ్గే మందులతో అంధత్వం!

మొదటి పేజీ తరువాయి

మందులు ఉన్నాయి. ఎఫ్‌డీఏ తాజా హెచ్చరిక ముఖ్యంగా 'నాన్-ఆర్టెరిటిక్ యాంటీరియర్ ఇస్కీమిక్ ఆప్టిక్ న్యూరోపతి' (నైయాన్) అనే అరుదైన కంటి రుగ్మతకు సంబంధించింది. ఆప్టిక్ నాడికి రక్త ప్రసరణ తగ్గడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీనివల్ల కంటిచూపు అకస్మాత్తుగా మందగించడమే కాకుండా, కొన్ని తీవ్రమైన కేసుల్లో శాశ్వతంగా చూపు కోల్పోయే అవకాశం కూడా ఉంది. ఓజెంపిక్, వెగోవీలలో కీలక క్రియాశీల పదార్థమైన 'సెమాగ్లూటైడ్' వినియోగానికి, ఈ కంటి సమస్యకు మధ్య సంబంధం ఉండే అవకాశం ఉందని 2024లో ప్రచురితమైన ఒక వైద్య పరిశోధన నివేదిక పేర్కొంది. ఆ నివేదిక వెలువడినప్పటి నుంచే యూఎస్ ఎఫ్‌డీఏ ఈ అంశంపై సమగ్ర విశ్లేషణ ప్రారంభించింది. సుమారు 125 క్లినికల్ ట్రయల్స్‌ను సమీక్షించిన అనంతరం, కనీసం ఏడాది పాటు జీఎల్‌పీ-1 ఔషధాలను ఉపయోగించిన ప్రతి 1,00,000 మంది రోగులలో దాదాపు ఆరుగురు ఈ నైయాన్ బారిన పడుతున్నారని గుర్తించారు. సాధారణ లేదా ఇతర గ్లూకోజ్ నివారణ చికిత్సలు తీసుకునే వారిలో ఈ వ్యాధి బారిన పడేవారి సంఖ్య లక్ష మందికి నలుగురి కంటే తక్కువగా ఉంది. ఈ కంటి సమస్య చాలా అరుదుగా వచ్చేదే అయినప్పటికీ, రోగులు మరియు వైద్యులు దీని తీవ్రతను గుర్తించాలని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది.





శ్రీశైలం, సాగర్ అసలు వివరాలివ్వండి

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన అసలు అనుమతులు, ఆ తర్వాత చేపట్టిన మార్పులు, విస్తరణల వివరాలను సమర్పించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఇంజినీర్-ఇన్-చీఫ్‌లకు లేఖలు రాసింది. ప్రాజెక్టుల అసలు రూపకల్పన, ఎడమ, కుడి కాలువల పరిధి, ఆయకట్టు, నీటి అవసరాలు, సాంకేతిక నివేదికలు, అనుమతి ఉత్తర్వుల వివరాలను ఆధారాలతో సహా అందించాలని స్పష్టం చేసింది. తొలుత ఆమోదించిన సాగునీరు, విద్యుత్, తాగునీటి అవసరాల్లో చేసిన మార్పులు, కొత్తగా చేర్చిన పథకాలు, వాటికి సంబంధించిన అనుమతుల వివరాలను కూడా కోరింది. 2026 అక్టోబర్ 15న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పంపిన లేఖలో తొలుత ఆమోదించిన ప్రాజెక్టుల వివరాలే ప్రామాణికమని పేర్కొన్న విషయాన్ని బోర్డు ప్రస్తావించింది. ప్రాజెక్టుల పరిధిలో జరిగిన మార్పులను పరిశీలించేందుకు అసలు అనుమతి పత్రాలు అవసరమని తెలిపింది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 30 వరకు పలు లేఖలు రాసినా అవసరమైన సమాచారం అందలేదని బోర్డు పేర్కొంది. రెండు రాష్ట్రాల హక్కులు, అభ్యంతరాలకు భంగం కలగకుండా, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న విచారణలకు విఘాతం లేకుండా వివరాలు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



ఇన్‌చార్జి వైద్యులతో పశుపోషకులకు ఇబ్బందులు

జగిత్యాల, నవంబర్ 10 (ఈవార్తలు): మల్లాపూర్ మండలంలో పశువైద్యుల కొరత కారణంగా పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సర్పంచులు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అలువాల శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ సమస్యను ప్రస్తావించారు. మండలంలో ముగ్గురు పశువైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఇన్‌చార్జి వైద్యులతోనే సేవలు కొనసాగుతున్నాయని సర్పంచులు తెలిపారు. దీంతో పశువులకు సకాలంలో వైద్యం అందక పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి పూర్తిస్థాయి పశువైద్యులను నియమించాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీఓ నరేష్, తహసీల్దార్ రాంచందర్, మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండాల సేకరణ అక్రమాలపై సర్కారు కొరడా

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): అండాల సేకరణ, సంతాన సాఫల్య చికిత్స కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు సంతాన సాఫల్య కేంద్రాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రంలో ఉన్న 44 కేంద్రాల్లో ఇప్పటివరకు 27 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించగా, 13 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. అండాల సేకరణ, నిల్వ, వినియోగం, దాతల వివరాల నిర్వహణలో నిబంధనలు పాటించకపోవడంపై దృష్టి సారించారు. సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం ప్రకారం కేంద్రాలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవడంతో పాటు నిర్దేశించిన విధానాలను పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై తదుపరి చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఏ ఉద్దేశంతో పోలీసు శాఖలో చేరారో మరిచిపోవద్దు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): పోలీసు శాఖలో చేరిన ఉద్దేశాన్ని అధికారులు ఎప్పుడూ మరిచిపోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్తగా శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీ అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ కూడా ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నేరాల తీరు మారిందని, మాదకద్రవ్యాల సరఫరా, ఆహార భద్రత, రహదారి ప్రమాదాలు, అంతర్జాల నేరాల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థలు అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ఈగల్ దళాన్ని ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. కొత్తగా నియమితులైన డీఎస్పీలకు అవసరమైతే విదేశాల్లో శిక్షణ, అధ్యయన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. నేరస్థలాల ఫోరెన్సిక్ పరిశీలనపై రూపొందించిన చేతిపుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు శివధర్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బోర్లకు 300 అడుగుల వరకు అనుమతివ్వాలి

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): బోరుబావుల తవ్వకాలకు 300 అడుగుల వరకు అనుమతులు ఇవ్వాలని తెలంగాణ రిగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్కు అంజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రిగ్ వాహనాలను అకారణంగా అడ్డుకోవడం, వేధించడం, స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోరుబావుల రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు, డ్రైవర్లు, వ్యాపారుల ఉపాధిని కాపాడాలని కోరారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 259ను సవరించి ఆచరణ సాధ్యమైన నిబంధనలు అమలు చేయాలన్నారు. గతంలో తవ్విన బోరుబావులకు జరిమానా లేకుండా ఉచితంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన 15 రోజుల్లో అనుమతులు ఇవ్వాలని, గడువులోగా అనుమతి రాకపోతే అనుమతి లభించినట్లుగా పరిగణించే విధానం అమలు చేయాలని కోరారు.

ఫోన్ ఛార్జింగ్‌కు రూ.10 వసూలు

ప్రకాశం, నవంబర్ 10 (ఈవార్తలు): తీవ్ర తుపాను తీరం దాటి వారం రోజులు గడిచినా ఏపీలోని ప్రకాశం జిల్లాలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. నవంబర్ 3న వచ్చిన తుపాను కారణంగా విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడంతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నాగులుప్పలపాడు, కనిగిరి, కొత్తపట్నం, సింగరాయకొండ, అద్దంకి మండలాల్లోని పలు ప్రాంతాలు ఇంకా చీకట్లోనే ఉన్నాయి. తాగునీటి కొరతతో పాటు ఫోన్లకు ఛార్జింగ్ చేసుకోవడమూ సమస్యగా మారింది. సమీప పట్టణాలకు వెళ్లి ఒక్కోసారి ఛార్జింగ్ చేసుకునేందుకు రూ.10 చెల్లించాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. తుపాను వల్ల రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు రూ.500 కోట్ల నుంచి రూ.700 కోట్లకు పైగా ఖర్చవుతుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.



సుమారు 35 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో గృహ వినియోగానికి ఒక రోజులో, వ్యవసాయ, ఆక్వా కనెక్షన్లకు మరో మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా అందిస్తామని వెల్లడించారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు వేలాది స్తంభాలు, విద్యుత్ మార్పిడి పరికరాలు నేలకూలాయి. వరద నీరు నిలిచిపోవడం, చెరువుల్లో స్తంభాలు పడిపోవడంతో మరమ్మతులకు ఆటంకం కలుగుతోంది. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నాయి.

ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయాలు

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా పలు విధానాలు, ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ విధానం 2026-31, ఏపీ రోబోటిక్స్-భౌతిక కృత్రిమ మేధ విధానాలతో పాటు అర్ధవాహక పరిశ్రమల విధాన సవరణలకు ఆమోదం తెలిపింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో రూ.31,387 కోట్లతో 512 మెగావాట్ల సామర్థ్యంతో కృత్రిమ మేధ ఆధారిత సమాచార కేంద్రం ఏర్పాటుకు అనుమతించింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో బ్యాటరీ పదార్థాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు, భోగాపురంలో రిలయన్స్ సమాచార కేంద్రానికి 25 ఎకరాల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయించేందుకు నిర్ణయించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఏర్పాటు చేయనున్న పరిశ్రమ ద్వారా 2,565 మందికి, పశ్చిమగోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణ ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. నక్కపల్లి ఔషధాల పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయించింది. రోడ్డు భద్రత కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు, తిరుమల ఆలయంలో కొన్ని పోస్టుల సృష్టి, శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపు వంటి నిర్ణయాలకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



ఇంటర్నెట్ లేకుండానే వాతావరణ సమాచారం

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): అంతర్జాల అనుసంధానం లేకుండానే వాతావరణ సమాచారాన్ని అందించే పరికరాన్ని హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి అగమ్ జైన్ రూపొందించారు. 'సమ్మిట్‌సాథి' పేరుతో రూపొందించిన ఈ పరికరం ఉపగ్రహాల నుంచి మేఘాలకు సంబంధించిన చిత్రాలను స్వీకరించి సమాచారాన్ని అందిస్తుంది. సాధారణ అంతర్జాల సదుపాయం అందుబాటులో లేని ప్రాంతాల్లోనూ వాతావరణ పరిస్థితులను తెలుసుకునేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా మేఘాల కదలికలను పరిశీలించేందుకు వీలుంటుంది. అయితే ఇది అధికారిక వాతావరణ శాఖ అందించే సూచనలకు ప్రత్యామ్నాయం కాదని, వాతావరణ అంచనాల కోసం సంబంధిత శాఖల సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రిటైర్మెంట్ వరకు ఐపీఎస్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఆయన పదవీ విరమణ తేదీ అయిన 2027 మార్చి 31 వరకు లేదా క్రిమినల్ విచారణ పూర్తయ్యే వరకు, ఏది ముందైతే అప్పటివరకు సస్పెన్షన్ కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో 'అగ్ని' వెబ్ పోర్టల్ నిర్వహణలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అలాగే సీఐడీ అదనపు డీజీపీగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో సుమారు రూ.1.15 కోట్ల మళ్లింపు జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 2024 డిసెంబర్ 3న తొలిసారి సస్పెండ్ చేశారు. అనంతరం అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. విచారణలు ఇంకా పూర్తికాకపోవడంతో సమీక్ష కమిటీ సిఫార్సుల మేరకు సస్పెన్షన్‌ను పొడిగించారు.

పులివెందుల కేసు కొట్టివేయాలని జగన్ పిటిషన్

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. స్థానిక ఎన్నికల సమయంలో జరిగిన నిరసనలకు సంబంధించి తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తనపై చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. మరోవైపు వైసీపీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు కూడా ఇదే వ్యవహారంలో హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద నిరసన తెలిపినందుకు ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మురుగుడు హనుమంతరావు, రుహుల్లాపై సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తమపై నమోదైన కేసులను కూడా రద్దు చేయాలని వారు పిటిషన్లు దాఖలు చేశారు.

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పక్కనే భారీ చోరీ

మేడ్చల్, నవంబర్ 10 (ఈవార్తలు): మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉన్న శ్రీ జగదాంబ జ్యువెలర్స్ దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం వెనుకవైపు గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించిన దొంగలు పెద్ద మొత్తంలో వెండి ఆభరణాలను అపహరించారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన వెలుగుచూసింది. దుకాణ యజమాని శేషమల్ చౌదరి కుమారుడు అజయ్ చౌదరి ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లగా వెనుక గోడ పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. లోపల ఉన్న వెండి వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఇదే దుకాణంలో చోరీ జరిగినట్లు తెలుస్తోంది. ఒకే దుకాణంలో రెండోసారి దొంగతనం జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఈ ఘటన జరగడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధారాల సేకరణకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించారు. దుకాణంలో ఎంత విలువైన వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పరిసర ప్రాంతాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

కరీంనగర్‌కు నితిన్ నబీన్

కరీంనగర్, నవంబర్ 10 (ఈవార్తలు): కరీంనగర్‌లో నవంబర్ 18న లక్ష మందితో భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ నాయకుడు నితిన్ నబీన్ హాజరుకానున్నట్లు ఎంపీ బండి సంజయ్ వెల్లడించారు. పార్టీ శ్రేణులను సమీకరించి ర్యాలీని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై పార్టీ నాయకులు దృష్టి సారించారు.



అక్షయకల్ప డెయిరీకి రూ.20 వేల జరిమానా

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): తాగునీటిని నేల శుభ్రం చేసేందుకు వినియోగించిన అక్షయకల్ప సంస్థకు జలమండలి అధికారులు రూ.20 వేల జరిమానా విధించారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 70లోని జర్నలిస్టు కాలనీలో ఉన్న అక్షయకల్ప ఫార్మ్ అండ్ ఫుడ్స్ ప్రాంగణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటిని నేల శుభ్రం చేసేందుకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జరిమానా విధించడంతో పాటు సంస్థ మురుగునీటి కనెక్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి వృథాను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. నేల శుభ్రం చేయడం, వాహనాలు కడగడం, తోటపని, నిర్మాణ పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించాలని సూచించారు. తాగునీటి వృథాపై ఫొటోలు, వీడియోలతో 99499 30003 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్ విడుదల

అమరావతి, నవంబర్ 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో ప్రకటించిన 686 పోస్టుల సంఖ్యను 720కు పెంచింది. ఇందులో 471 కార్యనిర్వాహక, 249 కార్యనిర్వాహకేతర పోస్టులు ఉన్నాయి. ఈ నోటిఫికేషన్‌లో 203 ఉప తహసీల్దార్ పోస్టులు, 176 ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి పోస్టులు, 91 సీనియర్ లెక్కల అధికారి పోస్టులు, 80 సహాయ విభాగాధికారి పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ అధికారి, నిషేధ, ఎక్సైజ్ ఉప తనిఖీ అధికారి పోస్టులను భర్తీ చేయనున్నారు.

భూగర్భ సర్వేలకు జీఎస్ఐ అండ

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి.. జీఎస్ఐలో ఆధునిక వసతులు ప్రారంభం



హైదరాబాద్, నవంబర్ 10 (పీఐబీ): బండ్లగూడ-నాగోల్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ)లో మూడు ప్రధాన మౌలిక వసతులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం ప్రారంభించారు. అంతర్జాతీయ వసతి గృహం, అధునాతన భౌగోళిక భౌతిక సమాచార విశ్లేషణ ప్రయోగశాల, డిజిటల్ స్టూడియోలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రారంభోత్సవం అనంతరం నూతన వసతులను పరిశీలించిన కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ వాటి వినియోగం, శిక్షణ, పరిశోధన సామర్థ్యాలపై సమీక్షించారు. అనంతరం జరిగిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదిగే ప్రయాణంలో ఖనిజ, గనుల రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 176 ఏళ్ల చరిత్ర కలిగిన జీఎస్ఐ దేశవ్యాప్తంగా భూగర్భ సర్వేలకు విశేషంగా తోడ్పడిందని పేర్కొన్నారు. జాతీయ కీలక ఖనిజాల మిషన్ ప్రాధాన్యాన్ని వివరించిన ఆయన, ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కీలక ఖనిజాలు, అరుదైన మూలకాల అన్వేషణను వేగవంతం చేయాలని జీఎస్ఐకి సూచించారు. ఖనిజ నిక్షేపాలు ఉండే అవకాశమున్న ప్రాంతాల్లో అన్వేషణను ముమ్మరం చేయాలని, ఖనిజ బ్లాకులను సకాలంలో సిద్ధం చేసి వేలానికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని సివానా రింగ్ కాంప్లెక్స్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అన్వేషణ పనులను ప్రస్తావించారు. జీఎస్ఐ పరిశోధన సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, సంస్థాగత సంస్కరణలు చేపట్టాలని కిషన్‌రెడ్డి అన్నారు. జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలతో సహకారాన్ని పెంచుకోవాలని సూచించారు. భూవిజ్ఞాన సమాచారాన్ని బహిరంగ వేదికల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. దేశ విద్యుత్ అవసరాలను తీర్చడంలో బొగ్గు ఆధారిత ఉష్ణ విద్యుత్ కీలకమని, తగినంత బొగ్గు ఉత్పత్తిని కొనసాగించడం ద్వారా ఇంధన భద్రతను కాపాడాలని పేర్కొన్నారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పురోగతి కీలకమన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, అర్ధవాహక పరిశ్రమలు, పరిశోధనలు ప్రపంచ అభివృద్ధిని ముందుకు నడిపిస్తున్నాయని తెలిపారు. ప్రపంచస్థాయిలో పోటీపడేలా దేశాన్ని బలోపేతం చేసేందుకు ఖనిజ వనరులను సమర్థంగా అన్వేషించి వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ జీఎస్ఐటీఐ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలను ముమ్మరం చేయాలని కోరారు. మూడు వసతుల ఏర్పాటుకు మొత్తం రూ.9.12 కోట్లు ఖర్చు చేశారు. జీఎస్ఐ రూ.4.27 కోట్లతో అంతర్జాతీయ వసతి గృహాన్ని నిర్మించింది. నలంద, తక్షశిల పేర్లతో ఏర్పాటు చేసిన ఈ వసతి గృహంలో భోజనశాల, వినోద సదుపాయాలు, వ్యాయామశాల, చిన్న గ్రంథాలయం, ఉతికే సదుపాయాలతో పాటు ఆధునిక ఫర్నిచర్‌తో కూడిన 32 గదులు ఉన్నాయి. విదేశీ శిక్షణార్థులకు సౌకర్యవంతమైన వసతి కల్పించడంతో పాటు అంతర్జాతీయ సంబంధాలు, సాంస్కృతిక మార్పిడికి ఇది తోడ్పడనుంది. జాతీయ ఖనిజ అన్వేషణ, అభివృద్ధి ట్రస్టు (ఎన్ఎంఈడీటీ), జీఎస్ఐ రూ.4.55 కోట్లతో అధునాతన భౌగోళిక భౌతిక సమాచార విశ్లేషణ ప్రయోగశాలను ఏర్పాటు చేశాయి. ఇందులో 25 అత్యాధునిక కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉన్నాయి. ఖనిజ అన్వేషణకు అవసరమైన సమాచార విశ్లేషణ, నమూనాల రూపకల్పన, గణనలకు ఈ ప్రయోగశాల ఉపయోగపడుతుంది. సామర్థ్య నిర్మాణ కమిషన్ (సీబీసీ), జీఎస్ఐ సంయుక్తంగా రూ.30 లక్షలతో డిజిటల్ స్టూడియోను ఏర్పాటు చేశాయి. మిషన్ కర్మయోగిలో భాగంగా ఐజీపోటీ కర్మయోగి వేదిక కోసం వీడియో పాఠాలు, శబ్ద ప్రసార కార్యక్రమాలు, అంతర్జాల సదస్సులు వంటి డిజిటల్ విద్యా వనరులను రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ దినేశ్ వీ. గన్వీర్, గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఫరీదా ఎం. నాయక్, మంత్రిత్వ శాఖ, జీఎస్ఐ, జీఎస్ఐటీఐ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

75 మంది విద్యార్థులకు రూ.75 వేల పంపిణీ



జగిత్యాల, నవంబర్ 10 (ఈవార్తలు): నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలిచేందుకు జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో 75 మంది విద్యార్థులకు రూ.75 వేల ఉపకార వేతనాలను మంగళవారం పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు బారీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బారీ మాట్లాడుతూ పట్టణంలోని పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉన్నత చదువులకు తమ వంతు సహకారం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొహమ్మద్ ఇమ్రాన్, అజీమ్ రాహి, పట్వారి సాజీద్, పట్వారి ముజాహిద్, ఇర్ఫాన్, నసీం, ఆసిమ్, ఇర్షాద్, రెహాన్, షేన్నా, షజ్జీ ఫెరోజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



యువ పార్లమెంట్‌లో శ్రీజ యామినికి ప్రథమ స్థానం

కొడిమ్యాల, నవంబర్ 10 (ఈవార్తలు): మై భారత్ ఆధ్వర్యంలో కొడిమ్యాల మండలం నాచుపల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌యూ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జగిత్యాల (యూసీఈజే) సహకారంతో వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2026-27 కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మత్తు పదార్థాలకు దూరంగా యువత - మాదకద్రవ్యాల రహిత భారత్' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కే. శ్రీజ యామిని ప్రథమ, పి. భవ్య ద్వితీయ, టి. రామ్‌చరణ్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.



మూఢనమ్మకాలను నమ్మవద్దు

కొడిమ్యాల, నవంబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజలకు పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ మంత్రాలు, చేతబడులు వంటి మూఢనమ్మకాలను విశ్వసించవద్దని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో భాగంగా శాస్త్రీయ మాయాజాల ప్రదర్శనల ద్వారా వివిధ అంశాలను వివరించి ప్రజల్లో అవగాహన కల్పించారు.



విదేశీ విద్యకు ఆర్థిక సాయం

ఉపకార వేతన పత్రాన్ని అందజేసిన బండి రమేష్

కూకట్‌పల్లి, నవంబర్ 10 (ఈవార్తలు): విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ విదేశీ విద్యా నిధి పథకం కింద రౌలకోల వంశీ విదేశీ విద్యకు అర్హత సాధించడంతో ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పత్రాన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో బండి రమేష్ విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి కూడా దోహదపడవచ్చన్నారు. ప్రభుత్వ ఆర్థిక సాయంతో విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య అభ్యసించిన వారు తిరిగి మాతృదేశానికి వచ్చి సేవలందించాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. వంశీని అభినందించారు. కార్యక్రమంలో పుష్పరెడ్డి, నాగార్జున, శ్రీనివాస్ బాబు, మస్తాన్‌రెడ్డి, క్రాంతి, లక్ష్మయ్య, బాలరాజు, రమణ, ఆసిఫ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై సామగ్రి పెడితే ఈ-పెట్టీ కేసులు

జగిత్యాల, నవంబర్ 10 (ఈవార్తలు) : దుకాణాలకు సంబంధించిన సామగ్రిని రహదారులపై ఉంచి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే వ్యాపారులపై ఈ-పెట్టీ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ హెచ్చరించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రహదారులు ఇప్పటికే ఇరుకుగా మారాయని ఆయన తెలిపారు. దీనికి తోడు కొందరు వ్యాపారులు దుకాణాల సామగ్రిని రోడ్లపైకి తీసుకొచ్చి ఉంచడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. సామగ్రిని దుకాణాల పరిధిలోనే ఉంచుకోవాలని పలుమార్లు సూచించినా కొందరు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇకపై రహదారులపై సామగ్రి ఉంచి రాకపోకలకు ఆటంకం కలిగించే వారిని గుర్తించి ఈ-పెట్టీ కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని స్పష్టం చేశారు. దుకాణాలకు సంబంధించిన సామగ్రితో పాటు ప్రకటన బోర్డులను కూడా దుకాణాల పరిధిలోనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కేపీహెచ్‌బీలో ప్రభుత్వ పాఠశాలకు భూమి బదిలీ

2.39 ఎకరాలను విద్యాశాఖకు అప్పగింత



కూకట్‌పల్లి, నవంబర్ 10 (ఈవార్తలు): కేపీహెచ్‌బీ డివిజన్‌లోని రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన 2.39 ఎకరాల భూమిని హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం కలెక్టర్ మనూ చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు మూడేళ్ల క్రితం ఈ స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టి పునాదులు కూడా వేశారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత వివిధ కారణాలతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. హౌసింగ్ బోర్డు పరిధిలోని 2.39 ఎకరాల స్థలాన్ని విద్యాశాఖకు బదిలీ చేయడంలో జాప్యం జరగడంతో పాఠశాల నిర్మాణం ముందుకు సాగలేదు. నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తాను పలుమార్లు కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను కలిసి సమస్య పరిష్కారానికి విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజలు, కాలనీవాసులు కూడా ఈ అంశంపై పోరాటం కొనసాగించారని పేర్కొన్నారు. భూమి బదిలీ ప్రక్రియ పూర్తికావడంతో పాఠశాల నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు. నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి, విద్యార్థులకు పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు. భూమి బదిలీకి సహకరించిన కలెక్టర్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన భూములను 22-ఏ నిబంధనల పరిధిలో ఉంచడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఉన్నత విద్య కోసం విద్యా రుణాలు, ఇతర అవసరాలకు బ్యాంకు రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ సమస్యను పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంఘాల ప్రతినిధులు నాగేశ్వరరావు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కోసం ప్రత్యేక యాప్ విడుదల చేయాలి

మల్కాజిగిరిలో జేఏసీ మహాధర్నా.. వారంలోగా స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం: సుల్తాన్ యాదగిరి



మల్కాజిగిరి, నవంబర్ 10 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మల్కాజిగిరి నియోజకవర్గం ఆధ్వర్యంలో మంగళవారం నేరేడ్‌మెట్ చౌరస్తా వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ ఉద్యమకారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం, అధికారిక గుర్తింపు కార్డు అందించాలని కోరారు. అలాగే 100 ఎకరాల్లో అమరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చే వారం రోజుల్లోగా ఉద్యమకారుల యాప్‌ను తీసుకురాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న ఉద్యమకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉద్యమ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అన్వర్ పటేల్, మోత్కూరు మల్లేష్, బి.ఎన్. జాంబవ్, ఆలకుంట కృష్ణ, రాజు గౌడ్, ఐలయ్య, జి. యాదగిరి, శ్రీశైలం చారి, రవీంద్ర చారి, బండ నర్సింగ్, అంకం సతీష్, అమర్, కొప్పుల కృష్ణ, లావణ్య, వి. అరుణ, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, శ్రీలత, వెంకటేష్, పెంటయ్య, పి. సుశీల, ఏ. సుశీల, పుట్ట విజయ, రేణుక, పి. కమలతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సంజయ్‌కు జ్యోతి కృతజ్ఞతలు

జగిత్యాల, నవంబర్ 10 (ఈవార్తలు) : జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అదువాల జ్యోతి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ నియామకంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ప్రత్యేక చొరవ చూపారు. బీసీ మహిళకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు కల్పించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఈ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియామకం అనంతరం జ్యోతి లక్ష్మణ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆమె అన్నారు. జిల్లాలో మహిళా నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చి మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు.

సారంగాపూర్ ఫీడర్‌లో 33 కేవీ కవర్డ్ కండక్టర్ ఏర్పాటు

సారంగాపూర్, నవంబర్ 10 (ఈవార్తలు): విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేసి వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర సరఫరా అందించాలనే లక్ష్యంతో సారంగాపూర్ ఫీడర్ పరిధిలో మూడు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన 33 కేవీ కవర్డ్ కండక్టర్‌ను మంగళవారం జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సుదర్శనం ప్రారంభించారు. ఈ ఆధునిక విద్యుత్ లైన్ అందుబాటులోకి రావడంతో సరఫరాలో విశ్వసనీయత పెరగడంతో పాటు పంపిణీ వ్యవస్థ సామర్థ్యం మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పనులను సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేసిన సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని సుదర్శనం అభినందించారు. విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.



సర్వే నంబర్ 138 భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలి

ప్రభుత్వ భూమిని కాపాడి మున్సిపాలిటీకి హక్కులు కల్పించాలి: జీవన్‌రెడ్డి



జగిత్యాల, నవంబర్ 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 138లో ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యావర్ రోడ్డును ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 138లోని 20 గుంటల భూమిపై మున్సిపాలిటీకి హక్కులు ఉన్నాయని ఆయన తెలిపారు. 1952లో పెట్రోల్ బంకు ఏర్పాటుకు కొంత భూమిని కేటాయించగా, నాలుగు గుంటల్లో మాత్రమే పెట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, మిగిలిన 16 గుంటలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు మున్సిపాలిటీ 2004లో తీర్మానం చేసిందని, దీనిపై ఆక్రమణదారులు హైకోర్టును ఆశ్రయించారని వివరించారు. 2008లో సంబంధిత పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు, యాజమాన్య హక్కుల విషయంలో సివిల్ కోర్టును ఆశ్రయించాలని సూచించిందన్నారు. అనంతరం డివిజన్ బెంచ్ కూడా మున్సిపల్ తీర్మానాన్ని సమర్థించిందని తెలిపారు. అయినప్పటికీ దాదాపు 17 ఏళ్లు గడిచినా భూమి హక్కుల విషయంలో చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా సర్వే నంబర్ 138లోని మొత్తం 20 గుంటలను నిషేధిత ఆస్తుల జాబితాలో, భూభారతి చట్టంలోని సెక్షన్ 22-ఏ పరిధిలో చేర్చాలని కోరారు. మున్సిపాలిటీ యాజమాన్య హక్కులను ధ్రువీకరించి, ఆక్రమణకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రాజీవ్‌ను రాజకీయాల్లోకి రావొద్దని వేడుకున్నా!

రాహుల్ విషయంలో అడ్డుకోలేదు.. ఆత్మకథలో సోనియా గాంధీ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 10: తన భర్త రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని, ఆ రంగంలోకి వెళ్లవద్దని వేడుకున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు. అయితే కుమారుడు రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు మాత్రం అడ్డుకోలేదని తెలిపారు. తన జీవిత ప్రయాణంపై రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో ఈ విషయాలను ప్రస్తావించారు. ఈ పుస్తకం మంగళవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. రాహుల్‌కు చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేదని సోనియా గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో కొనసాగడం వల్ల కుటుంబానికి ముప్పు ఎదురవుతుందని తెలిసినా రాజీవ్ ధైర్యంగా ముందుకు సాగారని పేర్కొన్నారు. తండ్రి నిర్ణయాలతో రాహుల్ కొన్ని సందర్భాల్లో విభేదించినప్పటికీ, ఆయన విలువలు, ధైర్యాన్ని ఎంతో గౌరవించేవారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గంతో రాహుల్, ప్రియాంక గాంధీ వాద్రాలకు ప్రత్యేక అనుబంధం ఉందని సోనియా వెల్లడించారు. చిన్నతనంలోనే రాజీవ్ పలుమార్లు రాహుల్‌ను అమేథీకి తీసుకెళ్లేవారని, గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను ప్రత్యక్షంగా పరిచయం చేసేవారని గుర్తుచేశారు. కుటుంబం పోటీ చేసిన ప్రతి ఎన్నికలో ప్రియాంక కూడా అమేథీలోనే ఉండి పార్టీ కార్యకర్తలు, ప్రజలతో మమేకమయ్యేవారని తెలిపారు. అయితే ఆ సమయంలో ప్రియాంక తన పిల్లల పెంపకం, బౌద్ధ అధ్యయనాల్లో ఉన్నత విద్యను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారని సోనియా వివరించారు. రాహుల్ విదేశాల నుంచి భారత్‌కు వచ్చినప్పుడల్లా తాను లేదా ప్రియాంకతో కలిసి అమేథీకి వెళ్లేవారని తెలిపారు. అక్కడి ప్రజలతో ఏర్పడిన అనుబంధం రాహుల్‌లో రాజకీయాలపై ఆసక్తిని మరింత పెంచిందన్నారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రాహుల్ అభివృద్ధి అధ్యయనాల్లో ఎంఫిల్ పూర్తి చేశారని సోనియా పేర్కొన్నారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ భారత్‌లో రాజకీయ పరిణామాలను నిశితంగా గమనించేవారని తెలిపారు. రాహుల్ రాజకీయాల్లోకి రావాలని పార్టీ నాయకులు కోరినప్పటికీ, ప్రజా జీవితంలోకి వస్తే వ్యక్తిగత స్వేచ్ఛ తగ్గడంతో పాటు నిరంతరం విమర్శలు, పరిశీలన ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయనకు తెలుసని



వివరించారు. తనతో, ప్రియాంకతో చర్చించిన అనంతరం ఎంతో ఆలోచించి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నారని వెల్లడించారు. 2004 మార్చిలో అమేథీ నుంచి పోటీ చేయనున్నట్లు రాహుల్ ప్రకటించారు. అదే ఎన్నికల్లో సోనియా గాంధీ సమీపంలోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. తొలి ఎన్నికల్లోనే రాహుల్ భారీ మెజార్టీతో విజయం సాధించారని సోనియా గుర్తుచేశారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి, గ్రామీణ అమేథీలో పరిశ్రమలు, వ్యాపార సంస్థల ఏర్పాటుకు కృషి చేశారని పేర్కొన్నారు.

ఇరాన్‌తో యుద్ధం వద్దు!

71 శాతం మంది అమెరికన్ల అభిప్రాయం

ట్రంప్‌కు సొంత ప్రజల నుంచి మరో షాక్

వాషింగ్టన్, నవంబర్ 10: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సొంత దేశ ప్రజల నుంచే మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని, ఆయన ప్రభుత్వం విధించిన దిగుమతి సుంకాలను రద్దు చేయాలని మెజారిటీ అమెరికన్లు కోరుకుంటున్నట్లు రాయిటర్స్--ఇప్సోస్ సంయుక్త సర్వే వెల్లడించింది. ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు సెనేట్‌తోపాటు ప్రతినిధుల సభలోనూ మెజారిటీ సాధించారు. దీంతో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి కొత్త కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన సర్వేలో 71 శాతం మంది ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేలా కాంగ్రెస్ చట్టం తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయం వ్యక్తం చేసిన వారిలో అత్యధికులు డెమొక్రాట్లు కాగా, తర్వాతి స్థానంలో రిపబ్లికన్లు ఉన్నారు. అలాగే ట్రంప్ ప్రభుత్వం విధించిన దిగుమతి సుంకాలను రద్దు చేయాలని 62 శాతం మంది కోరుకున్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరగడం, దిగుమతి సుంకాల ప్రభావంతో నిత్యావసరాల ధరలు అధికమవడం ప్రజలపై భారంగా మారాయని సర్వేలో వెల్లడైంది. కొత్త కాంగ్రెస్ తొలి 100 రోజుల్లో జీవన వ్యయాన్ని తగ్గించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని 90 శాతం మంది అభిప్రాయపడ్డారు. మరోవైపు ట్రంప్‌ను అభిశంసించే ప్రయత్నం దేశానికి మంచిది కాదని 42 శాతం మంది పేర్కొనగా, 33 శాతం మంది అందుకు మద్దతు తెలిపారు. ట్రంప్ ఆమోద రేటింగ్ 32 శాతానికి పడిపోయినట్లు సర్వే తెలిపింది. డెమొక్రాట్ల పట్ల 45 శాతం మంది, రిపబ్లికన్ల పట్ల 35 శాతం మంది మాత్రమే సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 1,705 మంది పెద్దల నుంచి ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాలు సేకరించి ఈ సర్వే నిర్వహించినట్లు సమాచారం.



అమెరికాలో దీపావళికి

అధికారిక సెలవు?

ప్రతినిధుల సభలో మళ్లీ బిల్లు.. 19 మంది సభ్యుల మద్దతు

వాషింగ్టన్, నవంబర్ 10: అమెరికాలో దీపావళి పండుగకు అధికారిక సమాఖ్య సెలవు హోదా కల్పించాలనే ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. దీపావళిని అమెరికాలో 12వ అధికారిక సమాఖ్య సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ సభ్యురాలు గ్రేస్ మెంగ్ నేతృత్వంలో ప్రతినిధుల సభలో 'దీపావళి దినోత్సవ చట్టం' బిల్లును తిరిగి ప్రవేశపెట్టారు. ఈ ప్రతిపాదనకు భారత సంతతికి చెందిన రాజా కృష్ణమూర్తి, సుహాస్ సుబ్రమణ్యం, శ్రీ థానేదార్, రో ఖన్నా, అమీ బేరాలతో పాటు మొత్తం 19 మంది చట్టసభ సభ్యులు మద్దతు ప్రకటించారు. అమెరికాలోని హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధుల సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యతను గుర్తించేందుకు ఈ బిల్లు దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. అమెరికాలో దక్షిణాసియా వర్గాలపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న విద్వేషపూరిత దాడులు, విధ్వంసాలను అరికట్టే దిశగా కూడా ఈ ప్రతిపాదన కీలకమని సభ్యులు పేర్కొన్నారు. వివిధ సామాజిక, మత సంస్థలు ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయి. గతంలో జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2023 మే 15న తొలిసారిగా ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, అది ప్రతినిధుల సభలోని పర్యవేక్షణ, జవాబుదారీతన కమిటీ వరకు వెళ్లి నిలిచిపోయింది. తాజాగా మరోసారి బిల్లును ప్రవేశపెట్టడంతో దీపావళికి అమెరికా అధికారిక గుర్తింపు లభిస్తుందా అనే ఆసక్తి నెలకొంది.

ఏఐ దెబ్బకు క్వాంటాస్‌లో

850 ఉద్యోగాల కోత

సిడ్నీ, నవంబర్ 10: కృత్రిమ మేధ వినియోగం, సంస్థాగత వ్యవస్థల ఆధునికీకరణ పేరుతో ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ క్వాంటాస్ ఎయిర్‌వేస్ 850 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రముఖ సాంకేతిక సేవల సంస్థ యాక్సెంచర్‌తో బహుళ సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. తొలగించనున్న ఉద్యోగులకు సంబంధించిన పనుల్లో అధిక భాగాన్ని భారత్‌లోని యాక్సెంచర్ బృందాలకు అప్పగించనుంది. క్వాంటాస్‌లో మొత్తం సుమారు 28 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా నిర్ణయంతో దాదాపు మూడు శాతం మంది ప్రభావితమవుతారు. తొలుత ఆర్థిక, కొనుగోళ్లు, మానవ వనరులు, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాల కోత ఉండనుంది. 2027 మధ్య నాటికి ఈ మార్పుల ప్రక్రియ ప్రారంభమవుతుందని సంస్థ వెల్లడించింది. కొన్ని ఉద్యోగాలను యాక్సెంచర్‌కు బదిలీ చేయనుండగా, వాటిలో అధిక భాగం భారత్ నుంచే నిర్వహించనున్నారు.

శబరిమలలో ముందుగానే

వర్చువల్ క్యూ టికెట్లు బుకింగ్

తిరువనంతపురం, నవంబర్ 10: శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లే భక్తులు ముందుగానే వర్చువల్ క్యూ టికెట్లు బుక్ చేసుకోవాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సూచించింది. నవంబర్ 17 నుంచి మండల-మకరవిళక్కు యాత్రా సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ మేరకు కీలక ప్రకటన విడుదల చేసింది. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించి, దర్శన ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వర్చువల్ క్యూ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపింది. యాత్రకు బయలుదేరే ముందే అధికారిక వెబ్‌సైట్‌లో దర్శన సమయాన్ని ఎంపిక చేసుకుని టికెట్ బుక్ చేసుకోవాలని సూచించింది. ముందస్తు నమోదు లేకుండా వస్తే దర్శన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొంది. భక్తులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా సులభంగా టికెట్లు పొందేందుకు ప్రత్యేక QR కోడ్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. దాన్ని స్కాన్ చేసి అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి వ్యక్తిగత వివరాలు, ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు వివరాలను నమోదు చేయడం ద్వారా ఉచితంగా వర్చువల్ క్యూ టికెట్ పొందవచ్చని వివరించింది. ఇప్పటికే అక్టోబర్ 29 నుంచి వర్చువల్ క్యూ సమయాల నమోదును ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి శబరిమలకు వచ్చే భక్తులు ముందుగానే తమ దర్శన సమయాలను ఖరారు చేసుకోవాలని దేవస్థానం బోర్డు కోరింది. నవంబర్ 16న సాయంత్రం 5 గంటలకు శబరిమల అయ్యప్ప ఆలయ ద్వారాలు తెరవనున్నారు. ప్రత్యేక పూజల అనంతరం నవంబర్ 17 ఉదయం నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. డిసెంబర్ 27 వరకు మండల పూజలు కొనసాగుతాయి. అనంతరం రెండు రోజుల పాటు ఆలయాన్ని మూసివేసి, డిసెంబర్ 30 నుంచి మకరవిళక్కు పూజలు ప్రారంభిస్తారు.

భారత్‌కు నాగాల పూర్వీకుల అవశేషాలు

39 మంది మానవ అవశేషాల తిరిగి అప్పగింత.. సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలకు ఏర్పాట్లు

లండన్, నవంబర్ 10: బ్రిటిష్ వలస పాలన సమయంలో భారత్ నుంచి తీసుకెళ్లిన 39 మంది నాగాల మానవ అవశేషాలను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పిట్ రివర్స్ మ్యూజియం వారి వారసులకు అప్పగించింది. ఈ చారిత్రక కార్యక్రమంలో పాల్గొనేందుకు నాగాలాండ్ నుంచి 30 మంది ప్రతినిధులు బ్రిటన్‌కు వెళ్లారు. తిరిగి అప్పగించిన అవశేషాలకు నాగా సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి, ఒకే స్మారక స్థలంలో గౌరవప్రదంగా సమాధి చేయాలని గిరిజన నాయకులు నిర్ణయించారు. ప్రధానంగా పుర్రెలతో కూడిన ఈ అవశేషాలు 1910 నుంచి 1940 మధ్య కాలంలో నాగాలాండ్ నుంచి ఆక్స్‌ఫర్డ్‌కు చేరినట్లు తెలుస్తోంది. 19వ శతాబ్దంలో స్థాపించిన పిట్ రివర్స్ మ్యూజియంలో నాగాల సంస్కృతికి సంబంధించిన ఆరు వేలకు పైగా వస్తువులు ఉన్నాయి. వీటిలో అధిక భాగాన్ని ఇద్దరు బ్రిటిష్ వలస పాలనాధికారులు మానవ శాస్త్ర పరిశోధనల పేరుతో సేకరించినట్లు మ్యూజియం వెల్లడించింది. కొన్ని వస్తువులను స్థానికుల అనుమతి లేకుండా, సైనిక దండయాత్రల సమయంలో బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. అవశేషాల అప్పగింత ప్రక్రియ ఆరేళ్లపాటు కొనసాగిందని మ్యూజియం డైరెక్టర్ లారా వాన్



బ్రోఖోవెన్ తెలిపారు. ఇందుకు సంబంధించి పలు అధికారిక అడ్డంకులను అధిగమించాల్సి వచ్చిందన్నారు. గత ఏడాది కూడా నాగా ప్రతినిధులు బ్రిటన్‌ను సందర్శించి ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. తాజాగా ఇరు పక్షాలు అధికారిక ఒప్పందంపై సంతకాలు చేశాయి. నాగా నాయకుడు తెజావో విహిన్యుతో మాట్లాడుతూ.. తమ పూర్వీకుల అవశేషాలకు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. ఏ పరిస్థితుల్లో వీటిని తమ భూమి నుంచి తీసుకెళ్లారో చెప్పడం కష్టమని, ఒక వ్యక్తి తన తండ్రి లేదా తాత పుర్రెను మరొకరికి బహుమతిగా ఇచ్చే అవకాశం లేదని వ్యాఖ్యానించారు. నాగాలాండ్‌కు చెందిన మానవ శాస్త్రవేత్త డాలీ కికోన్ మాట్లాడుతూ.. గతంలో నాగాల సమాజంలో యుద్ధ విజయానికి గుర్తుగా శత్రువుల తలలను తీసుకెళ్లే ఆచారం ఉండేదని వివరించారు. గ్రామాల మధ్యలో నాయకుల తలలను భద్రపరిచేవారని తెలిపారు. తాజాగా తిరిగి అప్పగించిన అవశేషాల్లో ఒకటి గిరిజన నాయకుడిదని వెల్లడించారు. వలస పాలన కాలంలో ఇతర దేశాల నుంచి సేకరించిన వస్తువులు, మానవ అవశేషాలను తిరిగి అప్పగించే ప్రక్రియకు పాశ్చాత్య దేశాల్లోని మ్యూజియంలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇందులో భాగంగా పిట్ రివర్స్ మ్యూజియం 2020లో మానవ అవశేషాల ప్రదర్శనను నిలిపివేసింది. అయినప్పటికీ మరో 2,700 అవశేషాలు తమ వద్ద నిల్వ ఉన్నాయని మ్యూజియం డైరెక్టర్ వెల్లడించారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికాలోని ఆదివాసీ సమాజాలకు కూడా గతంలో ఈ మ్యూజియం మానవ అవశేషాలను తిరిగి అప్పగించింది.

ఏఐ ఇంజినీరింగ్‌పై ఐఐటీ హైదరాబాద్ కొత్త కోర్సు

మూడు నెలల ఆన్‌లైన్ శిక్షణ..

డిసెంబర్ 5 నుంచి తరగతులు

హైదరాబాద్, నవంబర్ 10 (ఈవార్తలు): కృత్రిమ మేధ రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలనుకునే ఉద్యోగులకు ఐఐటీ హైదరాబాద్ కొత్త శిక్షణ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఫార్వర్డ్ డిప్లాయ్డ్ ఇంజినీరింగ్ ప్రాక్టీషనర్ ప్రోగ్రామ్' పేరుతో మూడు నెలల ధ్రువపత్ర కోర్సును ప్రారంభిస్తోంది. ఈ కోర్సు డిసెంబర్ 5 నుంచి మొదలుకానుంది. మొత్తం 13 వారాల పాటు సాగే ఈ కార్యక్రమంలో 52 ఆన్‌లైన్ తరగతుల ద్వారా 156 గంటల శిక్షణ అందించనున్నారు. ఆన్‌లైన్ శిక్షణతో పాటు సంగారెడ్డి జిల్లా కంది వద్ద ఉన్న ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో మూడు ఐచ్ఛిక ప్రత్యక్ష శిక్షణ తరగతుల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు ఐఐటీ హైదరాబాద్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను కేవలం ప్రయోగాలకే పరిమితం చేయకుండా వాస్తవ వ్యాపార కార్యకలాపాల్లో ఎలా ఉపయోగించాలనే అంశాలపై ఈ కోర్సులో శిక్షణ ఇస్తారు. సంస్థల సాఫ్ట్‌వేర్, సమాచార నిల్వ వ్యవస్థలు, వ్యాపార ప్రక్రియలతో కృత్రిమ మేధను అనుసంధానించడం నేర్పిస్తారు. స్వయంచాలకంగా పనిచేసే కృత్రిమ మేధ వ్యవస్థలు, పనుల క్రమబద్ధీకరణ, అనువర్తన ప్రోగ్రామింగ్ అనుసంధానాలపై ప్రాయోగిక శిక్షణ అందిస్తారు. ఐఐటీ హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ్ తమ్మన, డాక్టర్ ఆశిష్ మిశ్రా, డాక్టర్ అనుపమ్ సంఘీ, డాక్టర్ అభిజిత్ దాస్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్నారు. ఎన్.వి.ఎస్.ఎస్. కౌండిన్య పరిశ్రమల విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాఫ్ట్‌వేర్, సమాచార సాంకేతిక రంగాల్లో రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుందని ఐఐటీ హైదరాబాద్ తెలిపింది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వారికి సంస్థ ధ్రువపత్రం అందజేయనుంది.

బోయింగ్‌లో మళ్లీ ఉద్యోగాల కోత!

2,500 మందిపై ప్రభావం

వాషింగ్టన్, నవంబర్ 10: అమెరికాకు చెందిన ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్ మరోసారి ఉద్యోగుల సంఖ్యను తగ్గించేందుకు సిద్ధమైంది. సంస్థ వాణిజ్య విమానాల విభాగంలో సుమారు ఐదు శాతం మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. ఈ చర్యతో దాదాపు 2,500 మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. విమానాల తయారీలో జాప్యం, ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సరఫరా వ్యవస్థలో సమస్యల కారణంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని సంస్థ నిర్ణయించినట్లు తెలుస్తోంది. 737, 787 రకం విమానాల తయారీ లక్ష్యాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతున్నారు. డిసెంబర్ నుంచి స్వచ్ఛంద రాజీనామాలు, ఉద్యోగాల తొలగింపు నోటీసుల ద్వారా ప్రక్రియ ప్రారంభమవుతుందని వాణిజ్య విమానాల విభాగం అధిపతి స్టెఫానీ పోప్ వెల్లడించారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

న్యూఢిల్లీ, నవంబర్ 10: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడవచ్చని అంచనా వేసింది. అల్పపీడనం ఏర్పడిన 24 గంటల్లో బలపడి వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో నవంబర్ 14 నుంచి 16 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, అండమాన్ దీవుల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. తమిళనాడు తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.



కొత్త చిత్రం



‘భోగి’ నుంచి రోహిత్ పాఠక్ ఫస్ట్ లుక్ విడుదల



యువ కథానాయకుడు శర్వానంద్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’ నుంచి చిత్ర యూనిట్ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటుడు రోహిత్ పాఠక్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో రోహిత్ పాఠక్ ‘ఎస్ఐ నాగ్రే’ అనే పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు సంపత్ నంది తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకుంటూ రోహిత్ పాఠక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయనకు మరిన్ని మంచి అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాలో శర్వానంద్ ‘గంగా’ అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఇప్పటికే ఈ పాత్రను పరిచయం చేశారు. అలాగే కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ‘కందుల సులోచన రాణి’ అనే డీగ్లామర్, గ్రామీణ యువతి పాత్రను పోషిస్తున్నారు. 1960ల నాటి నేటివిటీతో కూడిన యాసలో అనుపమ ఎంతో సులువుగా డబ్బింగ్ చెప్పారని ఇటీవల దర్శకుడు ప్రశంసించారు. అడవిలో మోదుగ ఆకులతో తయారు చేసుకుంటూ జీవించే ఒక బలమైన, ఆత్మవిశ్వాసం కలిగిన మహిళగా ఆమె పాత్ర ఉండనుంది. ఈ చిత్రంలో మరో కథానాయికగా డింపుల్ హయతి నటిస్తున్నారు. తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఒక కల్పిత గ్రామం నేపథ్యంలో, 1960ల ప్రారంభ కాలం నాటి పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రానికి కిరణ్ కుమార్ మన్నే ప్రొడక్షన్ డిజైనర్‌గా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



రూ.290 కోట్లకు వారణాసి తెలుగు థియేట్రికల్ రైట్స్

కొనుగోలు చేసిన మైత్రి మూవీ మేకర్స్

టాలీవుడ్‌లో ప్రస్తుతం ఎక్కడ చూసినా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ‘వారణాసి’ సినిమా గురించే చర్చ నడుస్తోంది. సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతర్జాతీయ స్థాయి కథాంశంతో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన బిజినెస్ వ్యవహారాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా తెలుగు థియేట్రికల్ హక్కుల విషయంలో వినిపిస్తున్న రికార్డు స్థాయి డీల్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘వారణాసి’ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కే.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ప్రచార చిత్రాలు, వీడియోలు ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ ఏడాది చివరి నాటికి చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేయాలని దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులు, విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ‘వారణాసి’ సినిమా బిజినెస్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమా తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల్లోని తెలుగు వెర్షన్ థియేట్రికల్ హక్కుల కోసం దాదాపు రూ. 290 కోట్ల రికార్డు ధర చెల్లించినట్లు సమాచారం. ఇదే నిజమైతే తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత భారీ స్థాయి థియేట్రికల్ డీల్స్‌లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. మహేష్ బాబుకు ఉన్న భారీ క్రేజ్, రాజమౌళి సినిమాలపై దేశవ్యాప్తంగా ఉండే అంచనాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ చిత్రానికి ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఈ స్థాయిలో బిజినెస్ జరుగుతున్నట్లు ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ డీల్‌కు సంబంధించి నిర్మాతలు లేదా మైత్రి మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సినీ ప్రముఖులకు పోలీసుల హెచ్చరిక



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటన నేపథ్యంలో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. సినీ ప్రముఖులు బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుమిగూడే ప్రాంతాలకు వెళ్లవద్దని, అభిమానులతో జనసమూహాల మధ్య కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రముఖుల భద్రతపై ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ సూచనలు జారీ చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. కొన్ని వారాల క్రితం ముంబైలో టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత పలువురు సినీ ప్రముఖుల ఇళ్ల వద్ద కూడా దుండగులు రెక్కీ నిర్వహించినట్లు సమాచారం బయటకు వచ్చింది. దీంతో పోలీసులు సినీ ప్రముఖులకు భద్రతాపరమైన సూచనలు జారీ చేశారు. ఇటీవల బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ తన జుహులోని నివాసం ‘జల్సా’ వెలుపల అభిమానులకు అభివాదం చేశారు. అయితే బుల్లెట్ ప్రూఫ్ అద్దం వెనుక ఉండి అభిమానులకు అభివాదం చేయడం గమనార్హం. మరోవైపు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్నాయని చెప్పుకుంటున్న కొందరు వ్యక్తుల నుంచి పలువురు బాలీవుడ్ ప్రముఖులకు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నటీనటులకు సూచించారు.



అర్ధరాత్రి బాంబులు పేల్చడం ఏంటి?: రేణుదేశాయ్

దీపావళి పండుగ ముగిసినప్పటికీ అర్ధరాత్రి వేళల్లో భారీ శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడంపై ప్రముఖ నటి రేణూ దేశాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎదుటివారి ఇబ్బందులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం మూర్ఖత్వమేనని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆమె పెట్టిన సుదీర్ఘ పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పండుగను ఆనందంగా జరుపుకోవడంలో తప్పులేదని, అయితే ఆ ఆనందం ఇతరులకు ఇబ్బందిగా మారకూడదని ఆమె హితవు పలికారు. దీపావళి పండుగ సమయంలో టపాసుల శబ్దాలు, వాటి వల్ల కలిగే ఇబ్బందులపై తాను స్పందించకపోవడానికి గల కారణాన్ని కూడా రేణూ దేశాయ్ వెల్లడించారు. పండుగ రోజున ఈ విషయంపై ఏమైనా మాట్లాడితే తనను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసే అవకాశం ఉందని భావించి మౌనంగా ఉన్నట్లు తెలిపారు. అయితే పండుగ పూర్తయిన తర్వాత కూడా అర్ధరాత్రి వేళల్లో భారీ శబ్దాలతో టపాసులు కాల్చడంపై ఆమె ప్రశ్నించారు. రాత్రి 11 గంటలవుతోంది.. అయినా ప్రజలు ఇంకా పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాలుస్తూనే ఉన్నారు. దీపావళి రోజున నేను ఏమైనా మాట్లాడి ఉంటే నన్ను హిందూ వ్యతిరేకి అని ముద్ర వేసేవారు. అందుకే ఆ రోజు మౌనంగా ఉండిపోయాను. కానీ పండుగ అయిపోయిన తర్వాత కూడా రాత్రి 11 గంటలకు ఇంత పెద్ద శబ్దాలతో టపాసులు కాల్చడానికి ఇప్పుడు ఏ పండుగ ఉంది? అంటూ ఆమె తన అసహనాన్ని వ్యక్తం చేశారు.టపాసుల భారీ శబ్దాల వల్ల సమాజంలోని ఇతరులు ఎదుర్కొనే సమస్యలను కూడా రేణూ దేశాయ్ ప్రస్తావించారు.

రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నా: సూర్య



తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంతో మరో హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై చర్చ మొదలైంది. ఆయన కూడా రాజకీయాల్లోకి వస్తారా? విజయ్ బాటలో నడుస్తారా? అంటూ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ ప్రశ్నలకు సూర్య స్వయంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు. చెన్నైలో జరిగిన తన తాజా చిత్రం ‘సీన్’ విజయోత్సవ కార్యక్రమంలో సూర్య ఈ విషయంపై మాట్లాడారు. రాజకీయాల్లోకి రావడం లేదని చెబుతూనే.. రాజకీయాలంటే తనకు ద్వేషం లేదని పేర్కొన్నారు. రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నానని చెప్పారు. ఆ రంగంపై పూర్తిస్థాయి అవగాహన, బాధ్యతల గురించి తెలుసుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టబోనని స్పష్టం చేశారు. సూర్య రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది.



పెళ్లిపీటలెక్కనున్న ప్రియా భవానీ

తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ త్వరలోనే వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టబోతుంది. గత కొన్నేళ్లుగా తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌తో ప్రేమలో ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడు అతడితో ఏడడుగులు వేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రియా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. దీంతో అభిమానులు, నెటిజన్లు ఈ జంటకు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.ప్రియా భవానీ శంకర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో కొన్ని ప్రత్యేకమైన ఫోటోలను అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోల్లో ఆమె సాంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించడంతో పాటు, మెడలో మల్లెపూల దండలు ధరించి కనిపించారు. అంతేకాకుండా చేతులకు గోరింటాకు పెట్టుకున్న ఫోటోలను కూడా షేర్ చేశారు. ఈ ఫోటోలు చూస్తుంటే ఆమె ఇంట్లో పెళ్లి వేడుకలకు సంబంధించిన సంద‌డి మొదలైనట్లు అభిమానులు భావిస్తున్నారు.



సెహ్వాగ్ తనయుడి విధ్వంసం

ఆర్యవీర్ 168 బంతుల్లో 160 పరుగులు

అండర్-19 ఆసియా కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు

భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్.. తండ్రి తరహాలోనే మైదానంలో దూకుడు చూపించాడు. అండర్-19 ఆసియా కప్ 2026లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్యవీర్ 160 పరుగులతో చెలరేగాడు. 168 బంతులు ఎదుర్కొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే.

మ్యాచ్ ఆరంభంలో ఆర్యవీర్ ఆచితూచి ఆడాడు. తొలి పరుగులు చేసేందుకు 14 బంతులు తీసుకున్నాడు. క్రీజులో కుదురుకున్నాక మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కీలక మ్యాచ్‌లో అతడి శతకం భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపింది. చివరకు 168 బంతుల్లో 160 పరుగులు చేసి ఔటయ్యాడు. 153 పరుగుల వద్దే ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును అధిగమించాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తొలి బంతి నుంచే బౌలర్లపై దాడి చేసేవాడు. అయితే ఆర్యవీర్ తన ఆటతీరులో తండ్రి దూకుడుతో పాటు విరాట్ కోహ్లీ నుంచి స్ఫూర్తి పొందుతున్నట్లు గతంలో వెల్లడించాడు. దూకుడుగా ఆడటమంటే తనకు ఇష్టమని, సెహ్వాగ్ శైలితో పాటు కోహ్లీ తరహాలోనూ క్రికెట్ ఆడాలనుకుంటున్నానని చెప్పాడు. ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చెలాయించి భారత్‌కు విజయాలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. దాన్ని ఆచరణలో పెడుతున్నట్లు తాజా ఇన్నింగ్స్‌తో స్పష్టమవుతోంది.

నాన్నకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా:ఆర్యవీర్

ఆర్యవీర్, తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్‌కు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు వెల్లడించాడు. "నేను ఈ రోజు పెద్ద స్కోరు చేస్తానని ఒకరికి మాట ఇచ్చాను. అదృష్టవశాత్తూ ఆ మాటను నిలబెట్టుకున్నాను. ఆ వ్యక్తి మరెవరో కాదు.. మా నాన్నే. ఈ రోజు భారీ శతకం సాధిస్తానని నాన్నకు చెప్పాను. ఆయనకు ఎప్పుడూ భారీ సెంచరీలు చేయడమే ఇష్టం కాబట్టి, ఆయన వారసత్వాన్ని నేను ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది" అని 18 ఏళ్ల ఆర్యవీర్ పేర్కొన్నాడు. క్రీజులోకి వచ్చినప్పుడే కనీసం 40 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నానని, పిచ్‌పై సవాళ్లు ఎదురై డాట్ బాల్స్ ఎక్కువైనా తాను ఆందోళన చెందలేదని, చివర్లో పరుగులు రాబట్టగలననే నమ్మకంతో భారీ ఇన్నింగ్స్ ఆడానని వివరించాడు.





ముంబైకి అర్షదీప్.. ట్రేడ్ ఖరారు చేసిన తండ్రి!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అతిపెద్ద సంచలనం నమోదైంది. యువ పేస్ బౌలర్ అర్షదీప్ సింగ్ పంజాబ్ కింగ్స్‌ను వీడి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారాడు. ఈ భారీ ట్రేడ్‌కు సంబంధించి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, ఈ విషయాన్ని అర్షదీప్ తండ్రి దర్శన్ సింగ్ స్వయంగా ధ్రువీకరించారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో తన కుమారుడితో పాటు ఉన్న ఆయన, ఈ ట్రేడ్‌కు సంబంధించిన అధికారిక సమాచారం తమకు అందిందని ఒక వీడియో ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఈ ట్రేడ్ దాదాపు ఖరారైనట్లేనని స్పష్టమైంది. "ఈ ట్రేడ్ జరిగిందని మాకు కూడా ఆశ్చర్యంగానే తెలిసింది. దీని గురించి మాతో ముందస్తు చర్చలు ఏమీ జరపలేదు. ఇప్పుడు ట్రేడ్ అయినట్లు అధికారిక సమాచారం అందిందని అనుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్తున్నాడా? లేదా? అనే విషయంపై ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.



డిసెంబర్ 4న రింకూ, ప్రియా సరోజ్ పెళ్లి

టీమిండియా స్టార్ క్రికెటర్ రింకూ సింగ్ పెళ్లి సందడి మొదలైంది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో అతడు ఏడడుగులు వేయడానికి ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ 4న లక్నోలోని రమదా బై విండమ్ హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో వివాహ వేడుక జరగనుంది. ఇప్పటికే పెళ్లి పత్రికలు ముద్రించారు. కుటుంబ సభ్యులు బంధువులు, ప్రముఖులకు ఆహ్వానాలు అందిస్తున్నారు. వివాహ ఏర్పాట్లను రింకూ దగ్గరుండి చూసుకుంటున్నాడు. తన సోదరి నేహాతో కలిసి పెళ్లి పత్రికలను స్వయంగా ఎంపిక చేశాడు. అతిథుల ఆహ్వానాలు, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాడు. ఈ నెల చివర్లో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ కోసం దుబాయ్ వెళ్లాల్సి ఉంది. ఈలోగా పెళ్లికి సంబంధించిన ప్రధాన పనులన్నీ పూర్తి చేయాలని భావిస్తున్నాడు. దీపావళి సందర్భంగా స్వస్థలం అలీగఢ్‌కు వెళ్లిన రింకూ కుటుంబ సభ్యులతో గడిపాడు. పెళ్లి ఏర్పాట్లపై సమీక్షించాడు. ఆ సమయంలో తన సోదరి నేహాకు స్కూటీని బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కూడా స్వయంగా కలిసి పెళ్లికి ఆహ్వానించాలని రింకూ భావిస్తున్నాడని సమాచారం. ఇందుకోసం అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు తెలుస్తోంది. తల్లి, సోదరుడితో కలిసి సీఎంను కలిసే అవకాశం ఉంది. ఈ నెల 14 లేదా 15 తేదీల్లో ఈ భేటీ జరిగే అవకాశముందని సమాచారం. అనంతరం రింకూ దుబాయ్‌కు బయలుదేరనున్నాడు. ఈ పెళ్లి రింకూ కుటుంబానికి చాలా ప్రత్యేకమైనది. ఈ ఏడాది ఆరంభంలో తండ్రిని కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. అయినప్పటికీ పెళ్లి వేడుకను ఘనంగా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులంతా కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. రాజకీయ నాయకులు, స్నేహితులు, కుటుంబ సన్నిహితులు ఈ వేడుకలో పాల్గొననున్నారు.



మూడో వన్డే వర్షార్పణం

ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌కు 2-0 ఆధిక్యం

13న బే ఓవల్‌లో జరగనున్న నాలుగో వన్డే

భారత్-న్యూజిలాండ్ మధ్య మూడో వన్డేకు వర్షం అంతరాయం కలిగించింది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో మంగళవారం జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం కొనసాగుతోంది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో టాస్ ఆలస్యమైంది. పలుసార్లు టాస్‌ను వాయిదా వేశారు. మధ్యలో కాసేపు వరుణుడు విరామం ఇవ్వడంతో టాస్ వరకు మార్గం సుగమమైంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వరుసగా మూడోసారి టాస్ గెలిచిన గిల్.. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలని నిర్ణయించాడు. మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి సిద్ధమవుతున్న సమయంలో మళ్లీ వర్షం మొదలైంది. కాసేపటికే అది మరింత పెరగడంతో మైదానాన్ని తిరిగి కవర్లతో కప్పేశారు. ఆటగాళ్లు కూడా డ్రెస్సింగ్ రూములకు చేరుకున్నారు. న్యూజిలాండ్ కాలమానం ప్రకారం రాత్రి 7.50 గంటలకు 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించేందుకు తుది గడువు ఉంది. అప్పటికి ఇంకా 70 నిమిషాల సమయం ఉన్నప్పటికీ వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడో వన్డే రద్దుతో భారత్‌కు సిరీస్‌లో 2-0 ఆధిక్యం కొనసాగుతోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల కోసం ఇరు జట్లు టౌరంగాకు వెళ్లనున్నాయి. నాలుగో వన్డే నవంబర్ 13న బే ఓవల్‌లో, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి.

ఢిల్లీని వీడనున్న అక్షర్?

ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు లీగ్‌లో మరో సంచలన ట్రేడింగ్‌కు రంగం సిద్ధమవుతున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను ట్రేడింగ్ విండో ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దక్కించుకునే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ఊహాగానాలపై భారత వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. అక్షర్‌ను వదులుకోవడం ఢిల్లీ జట్టుకు తీరని నష్టమని విశ్లేషించాడు. "నాలుగు ఓవర్ల కోటాను సమర్థంగా పూర్తి చేయగల నాణ్యమైన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌తో పాటు, మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయగల ఆల్‌రౌండర్లు ఐపీఎల్‌లో చాలా అరుదు. అలాంటి విలువైన ఆటగాడిని ఢిల్లీ వదులుకోదని నేను భావిస్తున్నాను" అని అశ్విన్ పేర్కొన్నాడు. ఇప్పటికే రిషభ్ పంత్ ట్రేడ్ డీల్‌లో భాగంగా కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్‌జెయింట్స్‌కు వెళ్లారన్న ప్రచారం నేపథ్యంలో, ఇప్పుడు అక్షర్ కూడా జట్టును వీడితే ఢిల్లీ స్పిన్ విభాగం మరింత బలహీనపడుతుందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఒకవేళ ఈ ట్రేడ్ వాస్తవరూపం దాలిస్తే, ఢిల్లీ క్యాపిటల్స్‌కు కొత్త కెప్టెన్ అవసరం ఏర్పడుతుంది. గతంలో పంత్ కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించినప్పటికీ, మళ్లీ అతనికి ఆ బాధ్యతలు అప్పగిస్తే అది అతని బ్యాటింగ్‌పై ప్రభావం చూపవచ్చని అశ్విన్ విశ్లేషించాడు. పంత్‌పై ఒత్తిడి తగ్గించేందుకు అనుభవజ్ఞుడైన కేఎల్ రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించడం మేలని సూచించాడు. మరోవైపు, ఈ డీల్‌లో భాగంగా సీఎస్‌కే తమ ఆటగాళ్లు డెవాల్డ్ బ్రెవిస్ లేదా నూర్ అహ్మద్‌ను ఢిల్లీకి ఇచ్చే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే, ప్రస్తుతం ఈ వార్తలన్నీ కేవలం ఊహాగానాల దశలోనే ఉన్నాయి.

ట్రాగా భారత్-ఏ, కివీస్-ఏ సిరీస్

భారత్ 'ఏ', న్యూజిలాండ్ 'ఏ' జట్ల మధ్య జరిగిన మూడో అనధికారిక టెస్టు డ్రాగా ముగిసింది. వర్షం కారణంగా చివరి రెండు రోజుల ఆట పూర్తిగా సాధ్యం కాలేదు. మంగళవారం నాలుగో రోజు కూడా ఒక్క బంతి పడకుండానే మ్యాచ్‌ను రద్దు చేశారు. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 0-0తో ముగిసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 'ఏ' జట్టు రెండో రోజు 5 వికెట్ల నష్టానికి 464 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (102) శతకంతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ (88), తిలక్ వర్మ (81), ధ్రువ్ జురెల్ (71) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్) అర్ధశతకంతో నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో జాక్ గిబ్సన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 'ఏ' జట్టు మూడో రోజు వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి 2 వికెట్ల నష్టానికి 36 పరుగులు చేసింది. భారత బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీశాడు. చివరి రోజు కూడా వర్షం ఆటంకం కలిగించడంతో మ్యాచ్‌ను ముందుగానే ముగించారు. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లలో దేవదత్ పడిక్కల్, సాయి సుదర్శన్ ప్రత్యేకంగా నిలిచారు. తొలి మ్యాచ్‌లో పడిక్కల్ 199 పరుగులతో ఆకట్టుకోగా.. సాయి సుదర్శన్ రెండు అర్ధశతకాలు సాధించాడు. ఈ మ్యాచ్‌లో 88 పరుగులు చేశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో జైస్వాల్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో 279 పరుగులు సాధించాడు. 69.75 సగటుతో నిలిచాడు. ఇందులో రెండు శతకాలు ఉన్నాయి. ధ్రువ్ జురెల్ ఈ మ్యాచ్‌లో 71 పరుగులు చేయడంతో పాటు సిరీస్‌లో మరో శతకాన్ని కూడా నమోదు చేశాడు. నవంబర్ 19 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు ఈ మ్యాచ్‌లు భారత ఆటగాళ్లకు సాధనగా ఉపయోగపడ్డాయి. రిషభ్ పంత్ గాయం నుంచి కోలుకుంటుండటంతో తుది జట్టులో జురెల్‌కు అవకాశం దక్కే అంశం ఆసక్తికరంగా మారింది. భారత్ తరఫున జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, ప్రసిద్ధ్ కృష్ణ కూడా ఈ మ్యాచ్‌లో ఆడారు. అయితే బుమ్రా, ప్రసిద్ధ్ కలిపి కేవలం 11 ఓవర్ల మాత్రమే బౌలింగ్ చేయగలిగారు. జడేజాకు బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. బుమ్రా వికెట్ తీయకపోయినా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. ప్రసిద్ధ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

ఈవార్తలు
ప్రజావాణి
బుధవారం 11-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

ట్రంప్ ఇప్పటికైనా మారాలి

ప్రపంచ రాజకీయాల్లో అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. అగ్రరాజ్యాధినేతగా ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం అమెరికాపైనే కాకుండా ప్రపంచ దేశాల ఆర్థిక, రాజకీయ, భద్రతా పరిణామాలపైనా ప్రభావం చూపుతుంది. అలాంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ పాలనలో ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ శాంతికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. కానీ యుద్ధాలు, బెదిరింపులు, దౌత్యపరమైన ఒత్తిళ్లు, నోబెల్ శాంతి బహుమతి చుట్టూ చర్చలకే అధిక ప్రాధాన్యం దక్కుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రపంచానికి కావాల్సింది ఆధిపత్య పోరు కాదు.. ఆర్థిక భరోసా. దేశాలకు కావాల్సింది యుద్ధ వాతావరణం కాదు.. అభివృద్ధికి అనుకూలమైన శాంతియుత పరిస్థితులు. ప్రజలకు కావాల్సింది నాయకుల వ్యక్తిగత ప్రతిష్ఠ కాదు.. మెరుగైన జీవన ప్రమాణాలు. ఈ ప్రాథమిక అంశాలను పాలకులు విస్మరిస్తే ప్రజాస్వామ్య పాలన లక్ష్యమే ప్రశ్నార్థకమవుతుంది. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపైనా, సామాన్య ప్రజల జీవన వ్యయంపైనా ప్రభావం చూపుతోంది. చమురు ధరలు పెరగడం, ఇంధన వ్యయాలు అధికం కావడం, నిత్యావసరాల ధరలు ఎగబాకడం వంటి పరిణామాలు అమెరికా కుటుంబాలపై భారాన్ని పెంచుతున్నాయి. 2026 నవంబర్ 10న వెలువడిన గణాంకాల ప్రకారం అక్టోబరులో అమెరికా వినియోగ ధరలు 0.4 శాతం పెరిగాయి. యుద్ధ పరిణామాలు, చమురు ధరలు, దిగుమతి సుంకాలు ద్రవ్యోల్బణ ఒత్తిడికి కారణాలుగా విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధాన్ని మరింత విస్తరించడం కంటే చర్చల ద్వారా పరిష్కారం కనుగొనడమే ప్రాధాన్యం కావాలి. ప్రత్యర్థి దేశాలను బెదిరించడం, సైనిక బలాన్ని ప్రదర్శించడం తాత్కాలిక రాజకీయ ప్రచారానికి ఉపయోగపడవచ్చేమో కానీ శాశ్వత శాంతికి హామీ ఇవ్వలేవు. యుద్ధంలో గెలిచినా ఆర్థికంగా నష్టపోతే, ప్రజల జీవితాల్లో భద్రత కరువైతే ఆ విజయానికి అర్థమేమిటి? అమెరికా సైనిక శక్తిని ప్రపంచానికి చాటడం కంటే ఆ శక్తిని యుద్ధాలను నివారించడానికి ఉపయోగించాల్సిన అవసరం ఉంది. నోబెల్ శాంతి బహుమతిపై ట్రంప్ ఆసక్తి, తనను శాంతిదూతగా చరిత్ర గుర్తించాలని ఆయన ఆకాంక్షిస్తున్నారన్న చర్చలు అంతర్జాతీయంగా సాగుతున్నాయి. అయితే శాంతి బహుమతి కోసం ప్రయత్నించడం కంటే శాంతిని నెలకొల్పే కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. యుద్ధాలను ఆపడం, దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడం, మానవ ప్రాణాలను కాపాడటం, అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచడం ద్వారా మాత్రమే శాంతి సాధకుడిగా గుర్తింపు లభిస్తుంది. చరిత్రలో నిలిచిపోయే నాయకత్వం బహుమతుల కోసం చేసే ప్రయత్నాలతో కాకుండా ప్రజలకు అందించిన సేవలతోనే సాధ్యమవుతుంది.

నా ఓటు భద్రమే

ప్రజాస్వామ్యానికి ఓటు ప్రాణం. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఓటు హక్కు ఒకటి. ప్రభుత్వాలను ఎన్నుకోవడంలోనే కాదు.. దేశ భవిష్యత్తును నిర్ణయించడంలోనూ ఓటు కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు, అపోహలకు తావుండకూడదు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండాలి. అనర్హుల పేర్లు తొలగాలి. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వారి వివరాలను సరిచేయాలి. ఈ లక్ష్యంతో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను ఆ కోణంలోనే చూడాలి.



ఓటరు జాబితా ప్రక్షాళన అంటే ఓటు హక్కును హరించడం కాదు. అర్హులైన పౌరుల ఓటు హక్కును మరింత పటిష్ఠం చేయడమే దాని ప్రధాన ఉద్దేశం కావాలి. కాలక్రమంలో జనాభా మార్పులు, వలసలు, మరణాలు, చిరునామాల మార్పుల కారణంగా ఓటరు జాబితాల్లో తప్పులు చోటుచేసుకోవడం సహజం. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్దకపోతే ఎన్నికల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతాయి. అందుకే ఓటరు జాబితా ప్రక్షాళన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక నిరంతర బాధ్యతగా ఉండాలి. ఈ ప్రక్రియపై కొందరు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా విస్మరించలేం. పేదలు, నిరక్షరాస్యులు, వలస కార్మికులు, వృద్ధులు, చిరునామాలు మారిన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. పత్రాల సమర్పణలో సమస్యలు ఎదురైనంత మాత్రాన అర్హులైన పౌరుల పేర్లు తొలగిపోకూడదు. అందుకే ఎన్నికల సంఘం పారదర్శకతకు పెద్దపీట వేయాలి. ప్రతి తొలగింపునకు సరైన కారణం ఉండాలి. సంబంధిత ఓటరుకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. అభ్యంతరాలు చెప్పడానికి, ఆధారాలు సమర్పించడానికి, అప్పీలు చేసుకోవడానికి తగిన అవకాశం కల్పించాలి. బిహార్‌లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై దాఖలైన పిటిషన్లను 2026 మే 27న సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ ప్రక్రియ చేపట్టే అధికారం ఉందని స్పష్టం చేసింది. అయితే నోటీసులు, విచారణ, కారణాలతో కూడిన నిర్ణయం వంటి చట్టపరమైన రక్షణలు తప్పనిసరిగా అమలుకావాలని తీర్పులోని పరిశీలనలు తెలియజేస్తున్నాయి. అంటే ఓటరు జాబితా ప్రక్షాళనకు చట్టబద్ధత ఉన్నప్పటికీ, అర్హులైన ఓటర్ల హక్కుల పరిరక్షణకు అంతే ప్రాధాన్యం ఉంది. ఓటరు జాబితాలో పేరు ఉందని మాత్రమే ఓటు హక్కు భద్రంగా ఉందని భావించకూడదు. తన పేరు ఉందో లేదో ప్రతి పౌరుడు స్వయంగా పరిశీలించుకోవాలి. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులుంటే సరిచేయించుకోవాలి. పేరు గల్లంతైతే నిర్దేశిత గడువులో అభ్యంతరం తెలియజేయాలి. ఎన్నికల సంఘం పౌర సేవల అంతర్జాల వేదిక ద్వారా కూడా ఈ సదుపాయాలను అందుబాటులో ఉంచింది. అదే సమయంలో రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోకుండా, తమ బూత్ స్థాయి ప్రతినిధుల ద్వారా ఓటరు జాబితాల పరిశీలనలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. ఎన్నికల సంఘం చర్యలను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. అలాగే సరైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాల్సిన బాధ్యత కూడా ఉంది. అనుమానాలుంటే ఆధారాలతో ప్రశ్నించాలి. తప్పులుంటే సరిదిద్దాలని కోరాలి. కానీ సరైన లక్ష్యంతో చేపట్టిన ప్రక్రియపై అవగాహన లేకుండా అపోహలు వ్యాప్తి చేయడం ప్రజాస్వామ్యానికి ఉపయోగపడదు. భారతదేశం వంటి విశాలమైన ప్రజాస్వామ్యంలో కోట్లాది మంది ఓటర్ల వివరాలను నిరంతరం కచ్చితంగా నిర్వహించడం చిన్న విషయం కాదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, క్షేత్రస్థాయి పరిశీలనతో, ప్రజల భాగస్వామ్యంతో ఈ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కొత్తగా 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం, అర్హులైన ఒక్క పౌరుడు కూడా జాబితా నుంచి మిగిలిపోకుండా చూడటం అత్యంత కీలకం.



రణధీర్ గుండు



కృత్రిమ మేధకు కృత్రిమ బుడగ!

కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని శాసించబోతోందని సాగిన ప్రచారం ఇప్పుడు పెట్టుబడి ప్రపంచంలో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. సాంకేతిక విప్లవానికి చిహ్నంగా ఎదిగిన ఎన్విడియా మార్కెట్ విలువలో లక్షల కోట్ల రూపాయల మేర కోత పడటం సాధారణ పరిణామంగా చూడలేం. ఇది ఒక్క సంస్థ షేర్ల పతనమో, కొందరు మదుపరుల నష్టమో కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏఐ ఆధారిత పెట్టుబడుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి ప్రతిబింబం. సాంకేతిక రంగంలో అంచనాలు ఎంత వేగంగా పెరుగుతాయో, అవి తలకిందులైనప్పుడు నష్టాలు కూడా అంతే తీవ్రంగా ఉంటాయని ఈ పరిణామం గుర్తుచేస్తోంది.

ఎన్విడియా ఎదుగుదల వెనుక ఏఐ చిప్‌లకు పెరిగిన డిమాండ్ ప్రధాన కారణం. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక దిగ్గజాలు సమాచార కేంద్రాల ఏర్పాటుకు, అధునాతన కంప్యూటింగ్ వ్యవస్థలకు లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఈ పెట్టుబడులకు అవసరమైన శక్తిమంతమైన చిప్‌ల తయారీలో ఎన్విడియా కీలక స్థానాన్ని సంపాదించింది. అయితే ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టడం ఒక ఎత్తయితే, వాటి ద్వారా ఆశించిన ఆదాయాన్ని, లాభాలను సాధించడం మరో ఎత్తు. సాంకేతిక సామర్థ్యం పెరుగుతున్నంత వేగంగా వాణిజ్య ప్రయోజనాలు పెరుగుతున్నాయా? పెట్టుబడులకు తగిన ప్రతిఫలం వస్తుందా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. ఇప్పటికే కంపెనీ రెండో త్రైమాసికంలో 96.2 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేయడం, అందులో 89 బిలియన్ డాలర్లు సమాచార కేంద్రాల విభాగం నుంచే రావడం ఏఐ వ్యాపారానికి ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. మూడో త్రైమాసికంలో 108 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని సంస్థ అంచనా వేయడం కూడా గమనార్హం. అయినప్పటికీ మార్కెట్ విలువలో ఇంత భారీ కోత పడటం వెనుక కేవలం కంపెనీ ఆర్థిక ఫలితాలే కారణం కావు. భవిష్యత్తుపై అతిగా పెరిగిన అంచనాలు, పెట్టుబడులపై సందేహాలు, నాయకత్వం చుట్టూ వివాదాలు కలిసి మదుపరుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇక్కడ మరో కీలకమైన అంశం ఏఐ రంగంలో ఏర్పడుతున్న పెట్టుబడుల పోటీ. అమెరికాలోని సాంకేతిక దిగ్గజాలు ఒకదానితో మరొకటి పోటీపడుతూ సమాచార కేంద్రాల నిర్మాణం, చిప్‌ల కొనుగోలు, కంప్యూటింగ్ సామర్థ్యాల పెంపుపై భారీగా ఖర్చు చేస్తున్నాయి. ఈ ఖర్చులకు తగ్గట్టుగా ఆదాయం రాకపోతే పెట్టుబడులపై పునరాలోచన తప్పదు. ఏఐ సాంకేతికతకు భవిష్యత్తు లేదని దీని అర్థం కాదు. కానీ ఏఐ ఉందంటే ప్రతి సంస్థకు అపారమైన లాభాలు వస్తాయనే అంచనా మాత్రం వాస్తవికం కాదు. సాంకేతిక ఆవిష్కరణకు, దాని వాణిజ్య విజయానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మార్కెట్లు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ చుట్టూ నెలకొన్న వ్యక్తిగత, గూఢచర్య ఆరోపణలు సంస్థ ప్రతిష్ఠకు మరో సవాలుగా మారాయి. విదేశీ నిఘా కార్యకలాపాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై సంస్థ స్వతంత్ర విచారణకు సిద్ధమైంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు నిర్ధారణ అయిన వాస్తవాలుగా పరిగణించరాదు. అయినప్పటికీ ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధిపతుల వ్యక్తిగత వ్యవహారాలు కూడా సంస్థల పాలన, భద్రత, పెట్టుబడిదారుల విశ్వాసంతో ముడిపడుతున్నాయనడానికి ఈ పరిణామం నిదర్శనం. కీలక సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార రహస్యాలు, జాతీయ భద్రత వంటి అంశాల్లో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావుండకూడదు. ఈ పరిణామం భారత్‌కు కూడా అనేక పాఠాలు నేర్పుతోంది. ప్రపంచ ఏఐ పోటీలో భారత్ కూడా తనదైన స్థానాన్ని సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాచార కేంద్రాలు, చిప్‌ల తయారీ, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. అయితే విదేశీ సంస్థల సాంకేతికతపై పూర్తిగా ఆధారపడకుండా స్వదేశీ చిప్ తయారీ, పరిశోధన, మేధో సంపత్తి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఏఐని కేవలం వ్యాపార అవకాశంగా కాకుండా వ్యవసాయం, వైద్యం, విద్య, పరిశ్రమలు, ప్రభుత్వ సేవల్లో ప్రజలకు ఉపయోగపడే సాధనంగా మలచాలి. అదే సమయంలో సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యత, ఉద్యోగాలపై ప్రభావం వంటి అంశాలకు సమగ్ర విధానాలు రూపొందించాలి. నవంబర్ 17న వెలువడనున్న ఎన్విడియా తదుపరి త్రైమాసిక ఫలితాలు ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆదాయం, లాభాలు మాత్రమే కాకుండా ఏఐ చిప్‌లకు భవిష్యత్తులో ఉండే డిమాండ్, పెట్టుబడుల కొనసాగింపు, సంస్థ నాయకత్వంపై స్పష్టత కూడా కీలకం కానున్నాయి. ఒక సంస్థ మార్కెట్ విలువ లక్షల కోట్ల రూపాయలకు చేరిందంటే దాని భవిష్యత్తు ఎప్పటికీ సురక్షితమని భావించలేం. అదే విధంగా ఒక్కసారి షేరు పడిపోయిందని సాంకేతిక విప్లవం ముగిసిపోయిందని కూడా నిర్ణయించలేం. మార్కెట్ విలువ అనేది భవిష్యత్తుపై పెట్టుబడిదారుల అంచనాల ప్రతిబింబం మాత్రమే. ఆ అంచనాలకు వాస్తవ ఆదాయాలు, వినియోగం, ఉత్పాదకత తోడైనప్పుడే స్థిరమైన ఆర్థిక విలువ ఏర్పడుతుంది. ఏఐ యుగంలో విజయం సాధించేది అత్యధికంగా పెట్టుబడులు పెట్టిన సంస్థ కాదు.. పెట్టిన పెట్టుబడులకు ప్రజలకు ఉపయోగపడే ఫలితాలను అందించిన సంస్థే! సాంకేతికతను గుడ్డిగా నమ్మడం ఎంత ప్రమాదకరమో, దానిపై భయంతో వెనకడుగు వేయడం కూడా అంతే నష్టదాయకం. ఆవిష్కరణలకు ప్రోత్సాహం, పెట్టుబడులకు బాధ్యత, వ్యాపారానికి పారదర్శకత, ప్రజలకు ప్రయోజనం.. ఈ నాలుగు సూత్రాలే ఏఐ భవిష్యత్తుకు పునాదులు కావాలి. ఎన్విడియా పతనం ప్రపంచానికి చెబుతున్న అసలు పాఠం ఇదే.



వినోద్ కుమార్
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.